# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

హైదరాబాద్: సంపుటి : 01, సంచిక : 183, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) శుక్రవారం - 13 - సెప్టెంబర్ - 2024


## సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ ఇంట్లో గణేశ్ పూజకు ప్రధాని మోదీ.. చెలరేగిన తీవ్ర రాజకీయ దుమారం

ఈ కలయిక ఆందోళనకర సందేశాన్ని ఇస్తోందంటున్న విపక్షాలు

ప్రజలకు సందేహాలు కలుగుతాయన్న సంజయ్ రౌత్

గురువారం జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణేశ్ పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ



ఢిల్లీ: సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఇంట్లో గురువారం జరిగిన

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం... కేంద్రం సంకేతాలు!

అంతర్జాతీయ మార్కెట్లో మూడేళ్ల కనిష్ఠానికి చమురు ధరలు

ఇదే స్థాయిలో ఉంటే మన వద్ద ధరలు తగ్గే అవకాశముందంటున్న నిపుణులు

తక్కువ ధరకు వస్తుండటంతో రష్యా నుంచి ఎక్కువ దిగుమతి చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపిన జైన్



ఢిల్లీ : పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ మిగతా..2లో

## ఈ ఆరు దేశాల్లో వాట్సాప్‌పై నిషేధం.. దీని వెనుక ఉన్న కారణాలు ఏంటో తెలుసా..?




ఢిల్లీ : వాట్సాప్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా మూడు బిలియన్ల మంది వినియోగిస్తున్నారు. భారత్‌లోనూ 53కోట్ల మంది యూజర్లు ఉన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాల కోసం వాట్సాప్‌ను ఉపయోగించుకుంటున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా మిగతా..2లో

# రేవంత్ ఆశలన్నీ వారి పైనే - ఫలితం దక్కేనా..!!



వివరాలు 2లో..

తెలంగాణలో వర్షాలు, వరదల కారణంగా జన జీవనం అస్తవ్యస్తం అయింది

రాష్ట్రంలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని రేవంత్ కోరుతున్నారు

ఇక, కేంద్రం ఏ రకంగా స్పందిస్తుందనేది స్పష్టత రావాల్సి ఉంది

రాష్ట్ర ప్రభుత్వం భారీ వర్షాల కారణంగా రూ.9 వేల కోట్లకు పైనే నష్టం వాటిల్లిందని నివేదిక

హైదరబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు..వరదలతో భారీగా నష్టపోయింది. ఆర్థికంగా ఇబ్బందులతో ఉన్న వేళ కేంద్ర సాయం కోసం రేవంత్ ప్రయత్నం చేస్తున్నారు. ఈ రోజు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని రేవంత్ కోరుతున్నారు,. కేంద్ర సాయం పైన రేవంత్ ఆశలు పెట్టుకున్నారు. ఇక, కేంద్రం ఏ రకంగా స్పందిస్తుందనేది స్పష్టత రావాల్సి ఉంది. ఢిల్లీలో రేవంత్ తెలంగాణలో వర్షాలు, వరదల కారణంగా జన జీవనం అస్తవ్యస్తం అయింది. వరదల వల్ల ఏర్పడిన నష్టాన్ని పరిశీలించడానికి ఢిల్లీ నుంచి కేంద్ర బృందం వచ్చింది. వరదల వల్ల నష్టపోయిన జిల్లాల్లో పర్యటించింది. ఈ బృందానికి మిగతా..2లో

## నాపై హత్యాయత్నం జరిగింది... విడిచిపెట్టే ప్రసక్తే లేదు: అరికెపూడి గాంధీపై కౌశిక్ రెడ్డి నిప్పులు




2లో

చర్యకు ప్రతిచర్య ఉంటుందన్న పాడి కౌశిక్ రెడ్డి

శుక్రవారం గాంధీ ఇంటికి వెళ్లి నిరసన తెలుపుతామన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే

ప్లాన్ ప్రకారమే గుడ్లు, టమాటాలు తెచ్చి దాడి చేశారని ఆగ్రహం

హైదరాబాద్ :చర్యకు ప్రతిచర్య తప్పకుండా ఉంటుందని, విడిచిపెట్టే ప్రసక్తే లేదని, ఆ ప్రతిచర్య ఎలా ఉంటుందనేది రేపే చూస్తారని మిగతా..2లో

## బాలినేనికి జగన్ తాజా ఆఫర్ - "మెగా" ట్విస్ట్, వాట్ నెక్ట్స్..!!



- బాలినేని పార్టీ వీడుతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది
- కొద్ది రోజులుగా బాలినేని పార్టీ వీడే ఆలోచన చేస్తున్నారని ప్రచారం సాగుతోంది
- జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి పార్టీని బలోపేతం చేయాలని బాలినేనిని జగన్ కోరారు

అమరావతి: వైసీపీలో బాలినేని వ్యవహారం సంచలనంగా మారింది. బాలినేని పార్టీ వీడుతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఈ సమయంలోనే జగన్ తో బాలినేని సమావేశమయ్యారు. మిగతా..2లో


## ప్రకాశం బ్యారేజీని సందర్శించిన కేంద్ర బృందం



2లో

- కేంద్ర బృందానికి వివరాలు వెల్లడించిన జలవనరుల శాఖ అధికారులు
- బ్యారేజీ నీటి ప్రవాహం సహా వివిధ అంశాలను బృందం దృష్టికి తీసుకెళ్లిన అధికారులు
- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

అమరావతి: ప్రకాశం బ్యారేజీని కేంద్ర బృందం సందర్శించింది. భారీ వర్షాలు, వరదల



## రైతుల భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈ పార్కులు.. చంద్రబాబు సంచలన నిర్ణయాలు!!

### ఆహార శుద్ధి పరిశ్రమకు రాష్ట్రంలో అపార అవకాశాలు

అమరావతి : ఉపాధి కల్పనలో కీలకమైన ఎంఎస్ఎంఈ ల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి, వాటికి చేయూతను ఇస్తుందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి తగు ప్రోత్సాహం అందిస్తే ఈ రంగం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని సిఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.

రైతుల భాగస్వామ్యంతో వారే ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసుకునేలా కసరత్తు

అనేక సవాళ్లతో దెబ్బతిన్న ఈ రంగాన్ని సరికొత్త విధానాల ద్వారా మళ్లీ గాడిన పెడతామని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన పూర్తి చేసి వసతులు, సౌకర్యాలు కల్పించి పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో రైతుల భాగస్వామ్యంతో వారే ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసుకునే అంశంపై కసరత్తు చేయాలని సిఎం పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటులోను మిగతా..2లో

అనేక సవాళ్లతో దెబ్బతిన్న ఈ రంగాన్ని సరికొత్త విధానాల ద్వారా మళ్లీ గాడిన పెడతాం

ఆయా ప్రాంతాల్లో రైతుల భాగస్వామ్యంతో వారే ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసుకునే అంశంపై కసరత్తు చేయాలి

పరిశ్రమల ఏర్పాటులో అర్థంలేని నిబంధనలు తొలగించాలని, సులభంగా అనుమతులు ఇవ్వాలని సిఎం

ఎంఎస్ఎంఈకి క్రెడిట్ గ్యారెంటీకి రూ. 100 కోట్లు కేటాయిస్తాం

## కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి కన్నుమూత



- కొంతకాలంగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న సీతారాం ఏచూరి
- ఎయిమ్స్ లో చికిత్స పొందుతూ గురువారం ఈ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచిన వైనం
- వామపక్ష శ్రేణుల్లో విషాదం


ఢిల్లీ: వామపక్ష దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) కన్నుమూశారు.

## సీఎం చేసిన ద్రోహానికి ఎంతమంది ప్రాణాలు బలిపెట్టాలి?

### కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదు

- రైతు భరోసా, రుణమాఫీ కాలేదని రైతులు ప్రాణాలు వదులుతున్నారని ఆందోళన
- రైతు రుణ మాఫీ... రైతు భరోసా బోగస్ అని మండిపాటు
- ఏకకాలంలో రూ.2 లక్షల మాఫీ అని చెప్పి మాట తప్పిన సీఎంను ఏం చేయాలని ఆగ్రహం

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి చేసిన ద్రోహానికి ఎంతమంది రైతులు ప్రాణాలు బలిపెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రుణమాఫీ కాలేదని కొందరు... పెట్టుబడి సాయం రైతు భరోసా రాక మరి కొందరు ప్రాణాలు వదులుతు న్నారని మిగతా..2లో



ముఖ్యమంత్రి చేసిన తీరని ద్రోహానికి ఇంకా ఎంతమంది రైతులు ప్రాణాలను బలిపెట్టాలి?, ఏకకాలంలో అందరికీ 2 లక్షల రుణమాఫీ అని ఇచ్చిన మాటతప్పిన సీఎంను ఏం చేయాలి? డిసెంబర్‌లో పెట్టిన డెడ్‌లైన్ సెప్టెంబర్ దాటినా అమలు కాకపోతే దగాపడ్డ అన్నదాతలు ఇంకా ఎవరికి చెప్పుకోవాలి? అని ప్రశ్నల వర్షం

## నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య వందే భారత్.. 14న గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్న ప్రధాని మోదీ..



2లో

ఢిల్లీ : భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం రాష్ట్రాల మధ్య సెమీ హైస్పీడ్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్‌కు రైల్వేశాఖ రెండు కేటాయించింది. ఇందులో సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్, కాచిగూడ-యశ్వంత్‌పూర్-కాచిగూడ మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే, విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు సైతం మరో రైలు నడుస్తున్న విషయం తెలిసిందే. త్వరలో సికింద్రాబాద్‌కు మరో రైలు రానున్నది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు ఈ రైలు నడవనున్నది. ఈ నెల 14న ప్రధాని నరేంద్ర మోదీ రైలుకు ప్రారంభోత్సవం చేయనున్నారు. దీంతో పాటు మరో పది రైళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. నాగ్‌పూర్-సికింద్రాబాద్ రైలుతో పాటు టాటానగర్-పట్నా, బర్హంపూర్-టాటానగర్, రూర్కెలా-హౌరా, డియోఘర్-వారణాసి, మిగతా..2లో

## జగన్, చంద్రబాబులను టార్గెట్ చేసి రైతుల పరిహారంపై వైఎస్ షర్మిల నయా డిమాండ్!



అమరావతి: ఏపీలో వరదలకు దెబ్బ తిన్న పంటనష్టం ఎకరాకు 10వేలు కాదు..25వేల పరిహారం తక్షణం ఇవ్వాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి డిమాండ్ చేశారు. పెద్దాపురం మండలం, కంద్రుకోట గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన వైఎస్ షర్మిల ఏలేరు ఆధునీకరణపై వైఎస్ఆర్ కున్న చిత్తశుద్ధి బాబు,జగన్ లకు లేదని మండిపడ్డారు. వరద ముంపుకు మీరంటే మీరే కారణం మిగతా..2లో

## సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ ఇంట్లో గణేశ్ పూజకు ప్రధాని మోదీ.. చెలరేగిన తీవ్ర రాజకీయ దుమారం

మొదటి పేజి తరువాయి

గణేశ్ పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనడంపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్‌గా మారడంపై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రధాని, చీఫ్ జస్టిస్ కలయిక ఆందోళనకర సందేశాన్ని పంపుతోందని విపక్ష నాయకుల్లో ఒక వర్గం ఆరోపించింది. అయితే చీఫ్ జస్టిస్ ఇంట్లో గణేశ్ పూజకు ప్రధాని హాజరుకావడం నేరం కాదని బీజేపీ కౌంటర్ ఇచ్చింది. న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు అనేక సందర్భాల్లో వేదికలను పంచుకుంటారని వ్యాఖ్యానించింది. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ స్పందిస్తూ.. ఇలాంటి సమావేశాలు సందేహాలను రేకెత్తిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. శివసేన యూబీటీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మధ్య వివాదానికి సంబంధించిన కేసు నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్నాయని, అయితే ప్రధాని ఇప్పటివరకు ఎంత మంది ఇళ్లకు వెళ్లారో తన వద్ద సమాచారం లేదని అన్నారు. ఢిల్లీలో చాలా చోట్ల గణేశ్ ఉత్సవాలు జరుగుతాయని, అయితే ప్రధాని మాత్రం చీఫ్ జస్టిస్ ఇంటికి వెళ్లారని, ప్రధానమంత్రి, ప్రధాన న్యాయమూర్తి ఇద్దరూ కలిసి హారతి ఇచ్చారని అన్నారు. రాజ్యాంగ పరిరక్షకులు, రాజకీయ నాయకులను ఈ విధంగా కలుస్తూ ఉంటే ప్రజలకు సందేహాలు కలుగుతాయని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కాగా చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో గురువారం జరిగిన గణేశ్ పూజలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వెళ్లారు. ప్రధానికి చంద్రచూడ్ దంపతులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అనంతరం ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. "సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ గారి నివాసంలో జరిగిన వినాయకుడి పూజలో భాగమయ్యాయి. భగవంతుడు గణేష్ మనందరికీ ఆనందం, ఆరోగ్యం, సిరిసంపదలతో దీవించాలని కోరుకున్నాను" అని రాసుకొచ్చారు. ఒక ఫోటోను కూడా మోద షేర్ చేశారు. ఈ ఫొటోలో చీఫ్ జస్టిస్ దంపతులు కనిపించారు. అంతేకాదు ఈ కార్యక్రమానికి సంబంధించిన కూడా వైరల్ అయ్యాయి.

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం... కేంద్రం సంకేతాలు!

మొదటి పేజి తరువాయి

సంకేతాలు ఇచ్చారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గాయి. ప్రస్తుతం క్రూడాయిల్ బ్యారెల్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇలాగే కొనసాగితే భారత్‌లో చమురు ధరలు తగ్గే అవకాశాలు ఉంటాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని పంకజ్ జైన్ కూడా వెల్లడించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు ఇదేస్థాయిలో కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే అవకాశం ఉంటుందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. క్రూడాయిల్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో మూడేళ్ల కనిష్ఠానికి చేరుకున్నాయి. 2021 డిసెంబర్ తర్వాత బ్యారెల్ చమురు ధర రెండు రోజుల క్రితం 70 డాలర్ల దిగువకు చేరింది. రష్యా నుంచి తక్కువ ధరకు చమురు వస్తోందని, కాబట్టి అక్కటి నుంచి వీలైనంత ఎక్కువగా దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోందని పంకజ్ జైన్ వెల్లడించారు.

## కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి కన్నుమూత

మొదటి పేజి తరువాయి

కొంత కాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన... ఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతూ ఈ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కారణంగా సీతారాం ఏచూరి ఆగస్టు 19న ఎయిమ్స్ లో చేరారు. గత కొన్ని రోజుల నుంచి ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వస్తోంది. ఎయిమ్స్ వైద్యులు ఆయనకు వెంటిలేటర్ అమర్చి చికిత్స అందిస్తున్నారు. సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కల్పకం, సర్వేశ్వర సోమయాజులు ఏపీలోని కాకినాడకు చెందినవారు. చెన్నైలో పుట్టిన సీతారాం ఏచూరి హైదరాబాద్ లో విద్యాభ్యాసం చేశారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ ఎకనామిక్స్ చదివారు. 1969 నాటి తెలంగాణ ఉద్యమంలో ఆయన ఢిల్లీ వేదికగా చురుగ్గా పాల్గొన్నారు. 1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో చేరారు. ఆ మరుసటి ఏడాది సీపీఐ (మార్క్సిస్ట్) పార్టీలో చేరారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో ఆయన జేఎన్ యూ విద్యార్థిగా ఉన్నారు. ఆ సయయంలో ఆయనను కూడా అరెస్ట్ చేశారు. సీతారాం ఏచూరి వ్యక్తిగత జీవితం విషయానికొస్తే... మొదటి భార్య పేరు ఇంద్రాణి మజుందార్. ఆమె ప్రముఖ విద్యావేత్త, వామపక్ష కార్యకర్త, స్త్రీవాద ఉద్యమకారిణి వీణా మజుందార్ కుమార్తె. ఇక, ప్రముఖ మహిళా జర్నలిస్టు సీమా చిస్తీని సీతారాం ఏచూరి రెండో వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం కాగా... ఒక కుమార్తె ఎడింబరో వర్సిటీలో ప్రొఫెసర్. ఓ కుమారుడు పాత్రికేయుడు కాగా, మరో కుమారుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఇక, ఉమ్మడి ఏపీకి సీఎస్ గా వ్యవహరించిన మోహన్ కందా... సీతారాం ఏచూరికి మేనమామ అవుతారు.

## బాలినేనికి జగన్ తాజా ఆఫర్ - "మెగా" ట్విస్ట్, వాట్ నెక్స్ట్..!!

మొదటి పేజి తరువాయి

జిల్లాలో పార్టీ పరిస్థితుల పైన చర్చించారు. ఈవీఎంల వ్యవహారం పైన తాను చేస్తున్న పోరాట గురించి బాలినేని ప్రస్తావించారు. పార్టీ నుంచి మద్దతు లేకపోవటం పైన ప్రశ్నించారు. ఈ భేటీలో బాలినేనికి జగన్ తాజాగా ఒక ఆఫర్ ఇచ్చారు. బాలినేని తన వైఖరి ఏంటో క్లారిటీ ఇచ్చేసారు.

### జగన్ తో బాలినేని భేటీ

ప్రకాశం జిల్లా వైసీపీలో కలకలం మొదలైంది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అసంతృప్తితో ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో బాలినేనిని మంత్రి పదవి నుంచి తప్పించి సురేష్ ను కొనసాగించాలని నిర్ణయించిన సమయం నుంచే బాలినేని పార్టీ తీరు పట్ల అసహనంతో ఉన్నారు. ఆ తరువాత జగన్ ప్రతీ సందర్భంలో బుజ్జగించటంతో బాలినేని తిరిగి పార్టీలో యాక్టివ్ అవుతూ వస్తున్నారు. తాజాగా ఎన్నికల ఫలితాల్లో అనుమానాల పై బాలినేని ఈవీఎలం పై న్యాయ పోరాటం చేస్తున్నారు.

### బాధ్యతల పై జగన్ ఆఫర్

ఈ అంశంలో తనకు పార్టీ నుంచి మద్దతు రావటం లేదని బాలినేని ఓపెన్ గానే వ్యాఖ్యానించారు. కొద్ది రోజులుగా బాలినేని పార్టీ వీడే ఆలోచన చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. జనసేనలోకి వెళ్ల బోతున్నారని జిల్లాలో టాక్. అయితే, పలు సందర్భాల్లో తాను పార్టీ వీడటం లేదని బాలినేని స్పష్టత ఇచ్చారు. అయితే, బాలినేని సొంత పార్టీ నేతల పైనే పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేసారు. అదే సమయంలో జిల్లా అధ్యక్ష పదవి విషయంలోనూ చెవిరెడ్డి పేరు తెర పైకి రాగా..జిల్లాకు చెందిన వారికే అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని బాలినేని డిమాండ్ చేసారు.

### జనసేనతో టచ్ లో బాలినేని

దీంతో, మాజీ సీఎం జగన్ తో బాలినేని సమావేశమయ్యారు.జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి పార్టీని బలోపేతం చేయాలని బాలినేనిని జగన్ కోరినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే బాలినేని.. తనకు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే ఉద్దేశ్యం లేదని ఖరాఖండీగా చెప్పేసినట్టు సమాచారం. అయితే బాలినేని.. జనసేన, బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నట్టు ప్రచారం మళ్లీ తెర మీదకు వచ్చింది. మెగా బ్రదర్ నాగబాబుతో బాలినేని టచ్ లో ఉన్నారని చెబుతున్నారు. దీంతో..ఇప్పుడు బాలినేని వైసీపీ వీడటం..జనసేనలో చేరటం పైన ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ వస్తుందని సమాచారం.

## నాపై హత్యాయత్నం జరిగింది... విడిచిపెట్టే ప్రసక్తే లేదు : అరికెపూడి గాంధీపై కౌశిక్ రెడ్డి నిప్పులు

మొదటి పేజి తరువాయి

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. ఈరోజు తనపై హత్యాయత్నం జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అరికెపూడి గాంధీ తన అనుచరులతో కౌశిక్ రెడ్డి ఇంటి ఎదుట బైఠాయించిన సమయంలో ఉద్రిక్తత తలెత్తింది. గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కౌశిక్ రెడ్డి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్లి నిరసన తెలుపుదామని... కేసీఆర్ అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ తరలి రావాలని కోరారు. దాడి చేస్తే భయపడి పారిపోయే వ్యక్తిని కాదన్నారు. కాంగ్రెస్ గూండాలు తనపై హత్యాయత్నం చేశారన్నారు. తన ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారని... ప్లాన్ ప్రకారమే గుడ్లు, టమాటాలు తీసుకువచ్చారని విమర్శించారు. చంపే ప్రయత్నం చేస్తే.. మేమేందో కూడా చూపిస్తాం అని అన్నారు. గూండాలతో వచ్చి దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హారతులతో స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉంటే.. తమపై రాళ్ల దాడులు చేస్తారా? అని నిలదీశారు. రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యేకే రక్షణ లేదని, సామన్య ప్రజలకు ప్రభుత్వం రక్షణ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ప్రజాపాలన అంటే ఇదేనా రేవంత్ రెడ్డి? అని నిలదీశారు. ఐదేళ్ల తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని... పార్టీ మారిన నేతల సంగతి అప్పుడు చూస్తామని హెచ్చరించారు. ఐదేళ్ల తర్వాత కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, అప్పుడు మీ భరతం పట్టడం కూడా ఖాయమన్నారు. ఇది రాసిపెట్టుకోండన్నారు. ఇప్పుడు పార్టీ మారిన వారందరికీ నాలుగేళ్ళ తర్వాత సినిమా చూపిస్తామన్నారు. ప్రతిపక్షానికి పీఏసీ ఇవ్వడం ఆనవాయతీ అని... తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షానికి ఇచ్చామన్నారు. ఇప్పుడు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ దాఖలు చేసిన నామినేషన్లు ఏమయ్యాయో చెప్పాలన్నారు. నామినేషన్ దాఖలు చేయని అరికెపూడి గాంధీకి దొంగచాటున పీఏసీ ఎలా ఇస్తారని నిలదీశారు. అరికెపూడి మాట్లాడిన మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని... మైనంపల్లి హన్మంతరావు అల్వాల్‌లో మీటింగ్ పెట్టి ఇదే విధంగా కేటీఆర్‌ను దూషించారని గుర్తు చేశారు. కానీ 50 వేల ఓట్ల మెజార్టీతో ఓడిపోయారన్నారు. రేపు అరికెపూడికి ఆయన నియోజకవర్గంలోనూ ఇదే గతి పడుతుందన్నారు. ఉప ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో తమ దమ్మేందో చూపిస్తామన్నారు.

## రైతుల భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈ పార్కులు.. చంద్రబాబు సంచలన నిర్ణయాలు!!

మొదటి పేజి తరువాయి



ఆయా ప్రాంతాల్లో రైతుల భాగస్వామ్యంతో వారే ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసుకునే అంశంపై కసరత్తు చేయాలని సిఎం పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటులోను రైతుల భాగస్వామ్యం

భూములు కలిగిన రైతులు, ప్రైవేటు భాగస్వామ్యంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం పార్క్ లు ఏర్పాటుచేసుకునే విధానాన్ని అమల్లోకి తేవాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాజధానిలో ఎలాగైతే రైతు భాగస్వామ్యంతో వారికి లబ్ది చేకూర్చామో...అదే తరహా విధానాన్ని ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటులోను అవలంబించాలన్నారు. పూణె వంటి చోట్ల ఇలాంటి విధానం అమల్లో ఉందని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఈ విధానాలను పరిశీలించి రాష్ట్రంలో మెరుగ్గా అమలు చేయాలన్నారు చంద్రబాబు.

పరిశ్రమలకు సులభంగా అనుమతులు

పరిశ్రమల ఏర్పాటులో అర్థంలేని నిబంధనలు తొలగించాలని, సులభంగా అనుమతులు ఇవ్వాలని సిఎం అదేశించారు. అంతేకాదు ఆటోమేటిక్ గా అనుమతులు పొందే విధానాన్ని అమల్లోకి తేవాలన్నారు. ప్యాకింగ్, డిజిటల్ కామర్స్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే చిన్న పరిశ్రమల ఉత్పత్తులకు డిమాండ్ లభిస్తుందని అన్నారు. డ్వాక్రా సంఘాల వంటి వాటిని ఎంఎస్ఎంఇలతో అనుసంధానం చేయాలన్నారు.

నిర్మాణంలో ఉన్న 7 క్లస్టర్ లను పూర్తి చెయ్యాలి

. ఆటోనగర్లను మోడ్రనైజేషన్ చేయాలని, ఎలక్ట్రిక్ వెహికిల్స్ కు సర్వీస్ అందించే విధంగా నైపుణ్యం పెంచాలని సిఎం అన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 7 క్లస్టర్ లను పూర్తి చెయ్యాలన్నారు. ఎంఎస్ఎంఈకి క్రెడిట్ గ్యారెంటీకి రూ. 100 కోట్లు కేటాయిస్తామని సిఎం తెలిపారు. విశ్వకర్మవంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వ్యాపారులకు రుణాలు, ప్రోత్సాహకాలు, ట్రైనింగ్ అందేలా చూడాలని అన్నారు.

ఆహార శుద్ది పరిశ్రమకు రాష్ట్రంలో అపార అవకాశాలు

రాష్ట్రంలో ఆహారశుద్ది రంగంపై సిఎం సమీక్ష చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ కు రాష్ట్రంలో అపార అవకాశాలు, అనువైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. హార్టికల్చర్, ఆక్వా కల్చర్ ఉత్తత్తులకు...ఆహార శుద్ది పరిశ్రమ ద్వారా ఆదాయాలు పెరుగుతాయని సిఎం అన్నారు. రైతులు తాము పండించే పంటలకు వాళ్లే వాల్యూ ఎడిషన్ ఇచ్చుకునే పరిస్థితి కల్పించే విధంగా పాలసీ తీసుకురావాలని సిఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఎంఎస్ఎంఈలతో అనుసంధానం చేసి గ్రామాల్లో ప్రోత్సాహం ఇచ్చే విధంగా విధానాలు తీసుకురావాలని సూచించారు.

## జగన్, చంద్రబాబులను టార్గెట్ చేసి రైతుల పరిహారంపై వైఎస్ షర్మిల నయా డిమాండ్!

మొదటి పేజి తరువాయి



అని ఇద్దరూ విమర్శలు చేసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు.

ఏలేరు వరద ముంపు ప్రభుత్వాల వైఫల్యం వల్లే

ఏలేరు రైతులను నిండా ముంచిందని, వేల ఎకరాలు నీట మునిగాయని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వాలే అని, గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం అన్నారు. ఏలేరు మరమ్మత్తుల మీద ఎవరు దృష్టి పెట్టలేదని అసహనం వ్యక్తం చేశారు. మరమ్మత్తులు లేక రైతులు దారుణంగా నష్టపోయారన్నారు.

రైతుల నష్టానికి సమాధానం చెప్పాలి

ఒక్కో రైతు ఇప్పటి వరకు 30 వేల వరకు పెట్టుబడి నష్టపోయారని, పెట్టిన పెట్టుబడి మొత్తం వరదపాలు అయిందని పేర్కొన్నారు వైఎస్ షర్మిల. ఈ నష్టానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వైఎస్ఆర్ హయాంలో ఏలేరు ఆధునీకరణ పనులు చేపట్టారని, 135 కోట్లు కూడా విడుదల చేసి పనులు కూడా మొదలు పెట్టారని,వైఎస్ఆర్ చనిపోయాక ఏలేరు ఆధునీకరణ పై ఎవరు దృష్టి పెట్టలేదని విమర్శలు గుప్పించారు.

జగన్ మీద బాబు, బాబు మీద జగన్ ఆరోపణలు .. కానీ ఇద్దరూ దోషులే

ఇప్పుడు బాబు జగన్ తప్పిదమే అంటున్నాడు.. జగన్ బాబు తప్పిదం అంటున్నారు.. బాబు హయాంలో ఆధునీకరణ పనులు ఎందుకు చేయలేదు ? అని ప్రశ్నించారు. గత 10ఏళ్లుగా ఏలేరు ఆధునీకరణపై ఇద్దరికీ పట్టింపు లేదని తేల్చి చెప్పారు.జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికి వదిలేశారని, తట్టెడు మట్టి కూడా తియ్యలేదన్నారు. డ్యాంలు కొట్టుకు పోతున్నా జగన్ కి పట్టింపు లేదన్నారు.

నిర్లక్ష్యం ఫలితం రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల ఎకరాలకు నష్టం జరిగిందన్నారు.

ఎకరానికి 25 వేలు ప్రకటించాలి

చంద్రబాబు ఎకరాకు 10 వేల పరిహారం ఇస్తానన్నారని, అయితే 10 వేలు ఇస్తే ఏ మూలకు చాలుతుందో చెప్పాలన్నారు. కనీసం ఎకరాకు 25 వేల పరిహారం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. జగన్ హయాంలో ఎకరాకు 4 వేల పరిహారం అని మోసం చేశాడని, జగన్ చేసిన మోసం మళ్ళీ బాబు చెయ్యొద్దన్నారు.

తక్షణ పరిహారం ఇవ్వాలి

ఎన్డీయే ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరిగిన నష్టంపై వెంటనే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వానికి రాష్ట్రం అంటే చిన్న చూపని ఆరోపించారు. రైతుల నష్టంపై పర్యటనకు రావాలని, రైతులకు అండగా ఉండాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు .

## ఈ ఆరు దేశాల్లో వాట్సాప్‌పై నిషేధం.. దీని వెనుక ఉన్న కారణాలు ఏంటో తెలుసా..?

మొదటి పేజి తరువాయి

ఆరు దేశాల్లోని ప్రభుత్వాలు మెటా యాజమాన్యంలోని వాట్సాప్‌ని నిషేధించాయనే విషయం చాలా మందికి తెలియదు. ఆయా దేశాలు ఎందుకు వాట్సాప్‌ని బ్యాన్ చేశాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఇందులో భారత్‌కు పొరుగుదేశమైన చైనాతో పాటు ఇరాన్, యూఏఈ, ఖతార్, సిరియా, ఉత్తర కొరియా ఉన్నాయి. ఈ దేశాలు తమ దేశాల్లో వాట్సాప్ వాడకాన్ని నిషేధించాయి. బ్యాన్ వెనుక కారణాలు ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉన్నాయి. అయితే, ఆయా దేశాలు ఎందుకు వాట్సాప్‌ని బ్యాన్ చేశాయో తెలుసుకుందాం.

ఉత్తర కొరియా.. :- వాట్సాప్‌ని బ్యాన్ చేసిన దేశాల్లో ఉత్తర కొరియా ఒక్కటి. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ అన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ఇంటర్నెట్ విధానాలు ఇక్కడ అమలులో ఉన్నాయి. ఉత్తర కొరియాలో సాధారణ ప్రజలకు ఇంటర్‌నెట్ వినియోగం పరిమితంగా అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ప్రభుత్వం కమ్యూనికేషన్‌పై నియంత్రణను కొనసాగిస్తుంది. ఈ క్రమంలో వాట్సాప్ సహా పలు యాప్‌ని వినియోగించకుండా నిషేధం విధించారు. తద్వారా స్థానిక సమాచారాన్ని బయటకు వెల్లడికాకుండా సమాచార వ్యాప్తిని అడ్డుకట్ట వేసేలా కిమ్ వాట్సాప్‌ని బ్యాన్ చేశారు.

చైనాలో.. :- భారత్‌కు పొరుగుదేశం చైనాలో దాదాపు పరిస్థితి కాస్త ఉత్తర కొరియా తరహాలోనే ఉంటుంది. ఇక్కడ ఇంటర్‌నెట్ వినియోగంపై ప్రభుత్వానికే నియంత్రణ ఉంటుంది. చైనీస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని గ్రేట్ ఫైర్‌వాల్ పౌరులు బయటి ప్రపంచానికి సంబంధించిన అనేక విదేశీ యాప్‌లు, వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయకుండా నిరోధిస్తుంది. విదేశీ యాప్‌లకు బదులుగా వుయ్‌చాట్ తదితర స్వదేశీ యాప్‌లను ప్రోత్సహించేందుకు చైనా ప్రభుత్వం సమగ్ర వ్యూహంపై పని చేస్తుంది. కమ్యూనికేషన్ నియంత్రించడంలో భాగంగా వాట్సాప్‌ని నిషేధించింది.

సిరియాలో.. :- వాట్సాప్‌ను సిరియాలోనూ నిషేధించారు. సిరియా చాలా కాలంగా అంతర్యుద్ధంతో పోరాడుతోంది. పైగా సిరియాపై అనేక ఆంక్షలు విధించారు. దీని కారణంగా సిరియాలో వాట్సాప్ నిషేధించబడింది. దేశంలో జరిగే విషయాలు బయటికి చేరడం ఇక్కడి ప్రభుత్వానికి సైతం ఇష్టం లేదు. అదే సమయంలో సమగ్ర ఇంటర్నెట్ సెన్సార్‌షిప్ విధానంలో ఓ భాగంగా వాట్సాప్ నిషేధం కూడా భాగమే.

ఇరాన్‌లో.. :- ఇరాన్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక ఆంక్షలను ఎదుర్కొంటోంది. అణుబాంబు విషయంలో ఇరాన్, అమెరికాల మధ్య వివాదం నడుస్తోంది. దీని కారణంగా వాట్సాప్ ఇరాన్‌లో ఎప్పటికప్పుడు ఆంక్షలను ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజకీయ అశాంతి దృష్ట్యా కమ్యూనికేషన్, సమాచార వ్యాప్తిని నియంత్రించడానికి అక్కడి ప్రభుత్వం వాట్సాప్‌ను కూడా నిషేధించింది.

ఖతార్‌లో.. :- ఖతార్ ప్రభుత్వం వాట్సాప్ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్స్‌ని బ్లాక్ చేసింది. కేవలం టెక్స్ట్ సందేశాలు పంపుకునేందుకు మాత్రమే అవకాశం ఉన్నది. ఖతార్ ప్రభుత్వం తన టెలికాం కంపెనీలకు మద్దతు ఇచ్చేందుకు కాల్స్‌పై నిషేధం విధించింది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.. :- ఇటీవలి కాలంలో యూఏఈలో చాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయినప్పటికీ, అక్కడి ప్రభుత్వం ఖతార్ ప్రభుత్వం తరహాలోనే వాట్సాప్ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్స్‌ను బ్లాక్ చేసింది. యూఏఈలో టెక్స్ట్ మెసేజింగ్‌పై ఎలాంటి నిషేధాజ్ఞలు లేవు.

## నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య వందే భారత్.. 14న గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్న ప్రధాని మోదీ..

మొదటి పేజి తరువాయి

ఆగ్రా క్యాంట్ %-% బెనారస్, రాయ్‌పూర్-విశాఖపట్నం, గయా-హౌరా, భగల్‌పూర్-హౌరా, వారణాసి-డియోఘర్ మార్గాల్లో కొత్తగా రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి.

7.15 గంటల్లోనే 578 కిలోమీటర్ల ప్రయాణం

వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తే నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య ప్రయాణ సమయం తగ్గనున్నది. రెండు నగరాల మధ్య 578 కిలోమీటర్ల ఉండగా.. రైలు 7.15 గంటల్లోనే గమ్యస్థానం చేరనున్నది. నాగ్‌పూర్‌లో రైలు ఉదయం 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం ఒంటిగంటకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి రాత్రి 8.20 గంటలకు నాగ్‌పూర్ చేరుకోనున్నట్లు తెలుస్తున్నది. ఈ రైలు కాజీపేట్, రామగుండం, బల్హార్షా, చంద్రాపూర్, సేవ్‌గ్రామ్ స్టేషన్లలో ఆగనున్నది రైల్వేశాఖ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి మహారాష్ట్ర, తెలంగాణ మధ్య వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా వివిధ వ్యాపారాల నిమిత్తం నాగ్‌పూర్ ప్రాంతానికి వెళ్తుంటారు. ఈ క్రమంలో నాగ్‌పూర్-సికింద్రాబాద్ మార్గంలో సెమీహైస్పీడ్ రైలును నడిపేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తే రెండురాష్ట్రాల మధ్య కనెక్టివిటీ మరింత పెరిగే అవకాశం ఉన్నది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు పలు రైళ్లు నడుస్తున్నాయి. ఇవన్నీ సికింద్రాబాద్ మీదుగా ఢిల్లీతో పాటు పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. వందే భారత్ రైలు కేవలం రెండు నగరాల మధ్యనే రాకపోకలు సాగించనున్నది. అయితే, వందే భారత్‌లో టికెట్ ధర ఎంత ఉంటుంది ? తదితర వివరాలన్నీ తెలియాల్సి ఉన్నది.

## ప్రకాశం బ్యారేజీని సందర్శించిన కేంద్ర బృందం

మొదటి పేజి తరువాయి



కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నష్టం సంభవించింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఏపీ, తెలంగాణలలో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈరోజు కేంద్రబృందం బ్యారేజీని పరిశీలించింది. బ్యారేజీ నీటి ప్రవాహం తదితర విషయాలను జలవనరుల శాఖ అధికారులు కేంద్ర బృందానికి వెల్లడించారు. ఈఎన్సీ వెంకటేశ్వర్లు ఇందుకు సంబంధించిన వివరాలను అందించారు. ఈ నెల 1న రికార్డ్ స్థాయిలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందన్నారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో పరిస్థితి, ముంపునకు సంబంధించిన వివరాలను ఈ బృందం దృష్టికి తీసుకువెళ్లారు.

ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం 15.30 అడుగులుగా నమోదైంది. ఇక్కడి నుంచి సముద్రంలోకి 15.24 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కోనసీమలో లంక గ్రామాలు ఇంకా ముంపులోనే ఉండటంతో పడవల ద్వారా రాకపోకలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలచిపోయాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## సీఎం చేసిన ద్రోహానికి ఎంతమంది ప్రాణాలు బలిపెట్టాలి?

మొదటి పేజి తరువాయి

ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఆత్మహత్య చేసు కుంటు న్నప్ప టికీ కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కేసీఆర్ రైతును రాజును చేస్తే ఈ కాంగ్రెస్ సర్కార్ ప్రాణాలు తీస్తోందని ఆరోపించారు. రైతు రుణమాఫీ అంతా బోగస్, రైతు భరోసా కూడా బోగస్ అని ఆయన విమర్శించారు. నిన్న... రైతు సురేందర్ రెడ్డి... అటు బ్యాంకులు, ఇటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో మేడ్చల్‌లో వ్యవ సాయ కార్యాలయం సాక్షిగా ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లికి, తనకు ఉన్న రుణం మాఫీ కాలేదని, తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దగాకు బలయ్యాడని పేర్కొన్నారు. నేడు... రైతు సాగర్ రెడ్డి... భార్యాభర్తలిద్దరిలో ఒక్కరికీ రుణమాఫీ కాలేదని, దీంతో ఆయన ఆవేదనతో జగిత్యాలలో పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని వెల్లడించారు. తన పేరిట ఉన్న రూ.లక్షన్నర, తన భార్య పేరిట ఉన్న లక్షా 60 వేల రూపాయల రుణంలో ఒక్కరికీ మాఫీ కాలేదని తెలిపారు. రుణమాఫీతో కష్టాలు గట్టెక్కుతాయని ఆయన ఆశలు పెట్టుకున్నారని, కానీ దారుణంగా మోసపోయినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేసిన తీరని ద్రోహానికి ఇంకా ఎంతమంది రైతులు ప్రాణాలను బలిపెట్టాలి?, ఏకకాలంలో అందరికీ 2 లక్షల రుణమాఫీ అని ఇచ్చిన మాటతప్పిన సీఎంను ఏం చేయాలి? డిసెంబర్‌లో పెట్టిన డెడ్‌లైన్ సెప్టెంబర్ దాటినా అమలు కాకపోతే దగాపడ్డ అన్నదాతలు ఇంకా ఎవరికి చెప్పుకోవాలి? అని ప్రశ్నల వర్షం కురిపించారు. రూ.49,500 వేల కోట్ల రుణమాఫీలో పావు శాతం కూడా చేయకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, ఇందుకు రైతన్నలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంకెంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే మీ కళ్ళు చల్లారుతాయి? రేవంత్ రెడ్డి ఢిల్లీ యాత్రలు చేయటం కాదు రాష్ట్రంలో ఏం జరుగుతుందో చూడాలని సూచించారు. రైతులు కూడా ఆత్మహత్యలు చేసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## రేవంత్ ఆశలన్నీ వారి పైనే - ఫలితం దక్కేనా..!!

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం భారీ వర్షాల కారణంగా రూ.9 వేల కోట్లకు పైనే నష్టం వాటిల్లిందని నివేదిక అందించింది. బాధితులకు పూర్తి స్థాయిలో సాయం చేయాలని విన్నవించింది. సూర్యాపేట, నల్గొండ, వరంగల్?, మహబూబాబాద్?, ములుగు, ఖమ్మం, నాగర్? కర్నూల్?, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 8 రంగాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని పేర్కొంది.

వర్షాలతో భారీ నష్టం

ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్? జిల్లాల్లోని పట్టణాల్లో కాలనీలు, బస్తీలు, లోతట్టు ప్రాంతాలు మునిగి ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. మొదటిగా ప్రాథమిక నష్టం రూ.5,438 కోట్లుగా అంచనా వేయగా, అది దాదాపు రెట్టింపైంది. ఇప్పటి వరకు భారీ వర్షాలు, వరదలకు 35 మంది చనిపోయారు. 28,869 ఇళు కూలగా, 17,916 మంది నిరాశ్రయులు అయ్యారు. వరద నష్టాన్ని పరిశీలించడానికి కేంద్ర హోంశాఖ సహాయ కార్యదర్శి కర్నల్? కేపీ సింగ్? నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చింది.

కేంద్ర సాయం కోరుతూ

తక్కువ సమయంలో వేగంగా చర్యలు తీసుకోవడంతోనే ప్రాణ నష్టం తగ్గిందని అధికారులు వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగంగా చేయడానికి అవసరమైన నిధులను ఉదారంగా అందించాలని కోరారు. ఇటు కేంద్ర సాయం పై సీఎం రేవంత్ ప్రధాని, అమిత్ షా అప్పాయింట్ మెంట్ కోరారు. అమిత్ షాతో భేటీ ఖరారైంది. కేంద్ర మంత్రులను కలవనున్నారు. కేంద్రం నుంచి సాయం కోసం రేవంత్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు కేంద్రం ఏ రకంగా స్పందిస్తుందీ..ఏ మేర అండగా నిలుస్తుందనేది కీలకంగా మారుతోంది.

# అంబరాన్నంటిన గణేష్ నిమజ్జన సంబరాలు

## డీజే సౌండ్ తో, టపాకాయల శబ్దాలతో, భాజా భజంత్రీలతో దద్దరిల్లిన పట్టణం

## భారీగా జరిగిన ఉత్సవం, చిన్న వివాదం కూడా లేకుండా పూర్తి చేసిన సీఐ బీమా నాయక్





ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులు బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి మొదలైన గణేష్ విగ్రహాల నిమజ్జన యాత్ర అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. పట్టణం నలువైపుల నుంచి వినాయక విగ్రహాలు నెల్లూరు రోడ్డుకి రావడంతో భక్తులతో పురవీధులు కిటకిటలాడాయి. ఎటువైపు చూసిన తప్పెట్లు, భాజా భజంత్రీల, టపాకాయల మోతలతో పట్టణం మార్మోగిపోయింది. యువకులు, మహిళలు పెద్ద ఎత్తున రంగులు



జల్లుకుంటూ అధ్యంతం, డీజే వాహనాల ముందు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సిఐ భీమా నాయక్, ఈవో బ్రహ్మానందరెడ్డిల ముందస్తు పక్కా ప్రణాళికతో నిమజ్జన యాత్ర విజయవంతం బాధ్యతలు తీసుకొని పట్టుమని పది రోజులు కాకుండానే భారీ గణేష్ నిమజ్జన వేడుకలు రావడంతో ఎంతో ఛాలెంజింగ్ గా తీసుకొని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్, ఈవో బ్రహ్మానంద రెడ్డి, పోలీస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ల సహకారంతో పామూరు మండలంలోని పలు వినాయక విగ్రహాల కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పరిచి, వారికి ముందస్తు జాగ్రత్తలు సూచించి, ఎక్కడ ఏటువంటి వివాదం లేకుండా విజయవంతంగా గణేష్ నిమజ్జన కార్యక్రమం ను వారు నిర్వహించగలిగారు. సిఐ భీమా నాయక్, ఈవో బ్రహ్మానందరెడ్డి లను అభినందించిన ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీను కేవలం బాధ్యతలు తీసుకొని పదిరోజులు గడవక ముందే భారీ వినాయక నిమజ్జన కార్యక్రమం రావడం, ఇంతటి భారీ కార్యక్రమాన్ని ఇసుమంతైన వివాదం లేకుండా విజయవంతంగా పూర్తిచేసిన పామూరు సిఐ భీమా నాయక్ ను, పోలీస్ సిబ్బందిని, ఈవో బ్రహ్మానందరెడ్డిని, పంచాయతీ సిబ్బందిని, టిడిపి నాయకులు బొల్లా నరసింహారావుని, మెంటా నరసింహారావుని టిడిపి యువకులను యారవ శ్రీను అభినందించారు

**సిఐ భీమా నాయక్ మాట్లాడుతూ,,**



భారీ గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి వివాదం లేకుండా, గొడవలు లేకుండా, పోలీస్ అధికారులకు సహకరించిన గణేష్ కమిటీలకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు, గ్రామ పెద్దలకు, సహచర పోలీస్ సిబ్బందికి, పంచాయతీ సిబ్బందికి సిఐ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

# సంప్రదాయ ఎరువులతో " డ్రాగేన్ ఫ్రూట్స్" సాగుబడి!

## ఉద్యానవన శాఖ గుర్తింపుకు నోచుకోని వైనం?!

టంగుటూరు, (శుభోదయం న్యూస్): డ్రాగన్ ఫ్రూట్స్ సాగు వ్యవసాయ రంగంలో లాభదాయకమైన పంటగా ఉంది అనడంలో అతిశయోక్తి లేదు. వాటి వివరాల గురించి ఆసక్తిగా బుధవారం శుభోదయం



నిర్వాహకులను పలకరించింది. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం.... :- ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం వల్లూరు గ్రామం సమీపంలో జాతీయ రహదారి 16 ప్రక్కన ఈ పంట సాగులో ఉంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎకరాకి 2000 మొక్కలు అవసరమౌతాయని, 500 మేరకు రాతీ స్తంభాలు అవసరం అన్నారు. ఈ పంట మే మాసం నుండి నవంబర్ వరకు దీని సీజన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మిగిలిన రోజుల్లో వీటి సంరక్షణ ఉంటుందన్నారు. మామిడి పంటలాగా వీటిని వదిలేయకూడదని, డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగించాలన్నారు.







ఇది ఉద్యానవన పంట కిందకు వస్తుందని తెలిపారు. కానీ అనుకున్నంత మేరకు ప్రభుత్వం వైపు నుండి ఆదరణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. మన ప్రకాశం జిల్లాలో చాలా చోట్ల సాగబడి చేస్తున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. మొట్టమొదటిసారిగా 2019లో మన ప్రకాశం జిల్లాలో సాగు బడిలోకి తెచ్చామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో వీక్షించి తద్వారా ఈ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా సాగుబడి చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నామన్నారు. ఇదిలా ఉండగా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అనేకమంది జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు ఈ నర్సరీని సందర్శించడం జరిగిందని, డ్రాగన్ ఫ్రూట్స్ రైతుల వెతలను ఆలకించి వెళ్లడమే విశేషంగా ఉంది. ఏది ఏమైనప్పటికీ ఇకనైనా జిల్లాలోని ఈ డ్రాగన్ ఫ్రూట్స్ సాగుబడిదారులను ప్రభుత్వం గుర్తించి, వారికి చేయూతనిచ్చి, వారి జీవతాలకు తగినంత భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది చాలా స్పష్టం.

# ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాలి!

## జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ



## సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ వెల్లడి

టంగుటూరు, (శుభోదయం న్యూస్): ప్రభుత్వ అధికారుల ప్రజలకు జవాబుదానంగా ఉండాలని, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండేపి నియోజకవర్గం పరిధిలోని పొన్నలూరు మండలం ఇప్పగుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం పర్యటించడం జరిగిందన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రస్తుతం ఒక్కటే ఉండడం కారణంగా ప్రజలు అర కొర విద్యుత్ సరఫరాతో చాలా కాలం నుండి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితి గురించి సంబంధిత మండల విద్యుత్ శాఖ అధికారి రమేష్ బాబును కలిసి విన్నవించడం జరిగిందని, వెంటనే స్పందించి 15 రోజుల్లో మరో నూతన ట్రాన్స్ఫార్మర్ కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయంపై మనోజ్ కుమార్ స్పందిస్తూ, అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఉమ్మడి ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కు మంచి పేరు తేవాలని కోరుకుంటున్నామని మనోజ్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు

# గణనాధుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోతుల రామారావు..!



టంగుటూరు, (శుభోదయం న్యూస్): టంగుటూరు వాణి నగర్ లోని ఏకదంతా సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గణపతి స్వామి వారి ప్రత్యేక పూజ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక స్వామి వారి కరుణాకటాక్షాలతో అందరూ సుఖ సంతోషాలతో చల్లగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కామని శ్రీను, వాణి నగర్ ఏకదంతా సేవ కమిటీ సభ్యులు మరియు పుర ప్రజలు పాల్గొనడం జరిగింది.

# వినాయకుని నిమజ్జనం ఊరేగింపును పర్యవేక్షించిన సీఐ



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): వినాయక చవితి అయిదవరోజు నిమజ్జనం సందర్భంగా పట్టణంలో పలు వినాయక విగ్రహాలను కందుకూరు సిఐ కె. వెంకటేశ్వరరావు పర్యవేక్షించి యువతకు పలు సూచనలు చేశారు. అందులో భాగంగా పట్టణంలోని 14 వ వార్డు కొత్తపాలెం కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన వినాయకుని నిమజ్జనం సక్రమంగా నిర్వహించాలని అన్నారు. నిమజ్జనం అందరికీ కోలాహలంగా ఉండాలి తప్ప ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని ఆవిధిగా కమిటీ నిర్వాహకులు చూసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆయన అన్నారు. పట్టణంలో వినాయకుని పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందంతో వినాయకుడిని ప్రతిష్టిస్తారని ప్రతి ఒక్కరూ దానిని ఒక పండుగ చేసుకోవలె తప్ప ఎటువంటి అవంతరాలు జరగకుండా చూసుకుంటే అందరూ సంతోషంగా ఉంటారని ఆయన అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఎటువంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా నియమ నిబంధనలు పాటిస్తూనిమర్జనం చేసుకుంటే అందరికీ మంచిదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టంగుటూరు ఆర్యవైశ్య ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం!



టంగుటూరు, (శుభోదయం న్యూస్): టంగుటూరు ఆర్యవైశ్య గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 25వ వార్షిక గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పురం సెంటర్ గణేశుని విగ్రహం వద్ద భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 14వ తేదీ అనగా శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఉదయాస్తమన సేవా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం తిరుమల తిరుపతి దేవస్థానం పురోహితులు శ్రీమాన్ పరామ్ కుశమ్ రఘు ప్రసాద్ స్వామి వారి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. సేవా కార్యక్రమాల వివరాలు :- 14వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు తోమాల సేవ, 8 గంటలకు కొలుపు సేవ, సాయంత్రం 4 గంటలకు తిరుఫవాడ సేవ, రాత్రి 7 గంటలకు శ్రీ స్వామి వారి కళ్యాణం, రాత్రి 10 గంటలకు ఏకాంత సేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు గణపతి పూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందని, రాత్రి 7 గంటలకు గణపతి స్వామి నగర ఊరేగింపు తదనంతరం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# రోడ్ పై ప్రవహిస్తున్న డ్రైనేజీ మురికి నీరు



రాజమహేంద్రవరం, (శుభోదయం న్యూస్) : స్థానిక రాజమహేంద్రవరం రూరల్ కవలగొయ్యి రోడ్ నందు డ్రైనేజీ నుండి మురికి నీరు రోడ్ పై ప్రవహిస్తుందని, ఈరోడ్ కు ఆనుకొని ప్రముఖ స్కూల్స్, గ్రామాలు ఉండటం వలన ప్రతి రోజు వందల సంఖ్యలో బస్సులు, ఆటోలు, అనేక వాహనాలు అటు, ఇటు ఉదయం నుండి అర్ధరాత్రి వరకు ప్రయాణం చేస్తారని , సరి అయిన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన మురుగు నీరు రోడ్ పై ప్రవహించి ప్రమాదాలు, అంటూ రోగాలు ఏర్పాడే అవకాశం ఉందని సంబందించిన అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవలసింది గా పలువురు తెలిపారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పాత సింగరాయకొండ విద్యార్థినులు!



టంగుటూరు, (శుభోదయం న్యూస్): పాత సింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సిహెచ్ తులసి, డి అక్షర, సిహెచ్ పూజలు ఫ్లోర్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు హెచ్ఎం సిహెచ్ పద్మజ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి నరసరావుపేటలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జరిగిన 18వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో యు 14 బాలికల విభాగంలో మంచి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి జట్టు లో స్థానం సంపాదించారన్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులు ఈ నెలలో తమిళనాడు రాష్ట్రంలోని చంగల్పట్టులో, 27వ తేదీ నుండి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులను పిఈటి ఎండి అన్వర్, ఉపాధ్యాయ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు విద్యార్థినులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే నిర్దోషి దళిత సంఘాల భారీ ర్యాలీ

## ట్రాప్ చేయడానికి సహకరించిన వారి పై కఠినమైన చర్యలు తీసుకోవాలి



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్ ): సత్యవేడులో నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలంలో దళిత నాయకులు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంకు మద్దతుగా నియోజకవర్గంలోని ఏడు మండలాల నుండి దళిత నాయకులు, వరదయ్యపాలెం మండలంలోని 28 పంచాయతీల దళిత మహిళలు దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టి బస్టాండ్ సమీపం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మైకు నందయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలం అమాయకుడని కావాలని ఈ ట్రాప్ లో దింపి ఆయనకు రాజకీయ సమాధి కట్టాలని కావాలని దుష్టశక్తులు పండిన ఉచ్చులో ఆదిమూలం తగులుకోవడం జరిగిందని.. వరలక్ష్మి రిలీజ్ చేసిన వీడియో కానీ హైదరాబాదులో ఆమె ఇచ్చిన ప్రెస్ మీట్ లో గాని అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని వీటిని అన్నిటిని నీకు



తెల్చే పనిలో ఇటు ప్రభుత్వం అటు పోలీసులు చూడాలని... ఆమెపై సుమోటో కేసు నమోదు చేసి చర్యలు కఠినంగా తీసుకోవాలని బస్టాండ్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి వరదయ్యపాలెం సబ్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగినది. అనంతరం కిషోర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలం నియోజకవర్గంలో బలమైన నాయకుడని ఎప్పుడూ అభివృద్ధి కోరుకునే నాయకుడని ఆయన్ను రెండుసార్లు ఓడించాలన్న రెండుసార్లు గెలిచిన నాయకుడని వేరే ఏ దారి లేకుండా ఒక మహిళను అడ్డం పెట్టుకొని ఫ్రీ పెయిడ్ ప్లాన్ తో స్కెచ్ వేసి ఆదిమూలమును ఇరికించారని... వీటన్నిటినీ ఛేదించుకొని ఆదిమూలం బయటికి వస్తారని దానికి పూర్తి మద్దతు తమ వైపు నుండి ఉంటుందని తెలిపారు. కరుణాకర్ నాయుడు మాట్లాడుతూ ప్లాన్ చేసి ఇరికిచ్చిన వారిని దర్యాప్తు చేసి కస్టడీలో తీసుకోవాలని తెలిపారుఈ కార్యక్రమంలో పాల్ మహేష్, పుట్టయ్య, గంగాధరం, వెంకటయ్య,కోటి,చిరంజీవి, చెల్లయ్య,శంకర్, మురళి, రమణయ్య,ఆటో అంకయ్య, సత్యవేడు నియోజకవర్గ ఏడు మండలాల దళితే నాయకులు భారీ ఎత్తున హాజరయ్యారు భారీ సంఖ్యలో దళిత మహిళాలు, దళితనాయకులు మరియు అగ్రకులనాయకులు పాల్గొన్నారు.

# లోకా ఫౌండేషన్ వన్ హ్యుమానిటీ కేర్ ఆధ్వర్యంలో

## కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స విశేష స్పందన



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్) : ప్రతి రెండవ నాలుగోవ గురువారాల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలంలోని బత్తల వల్లం ఏకం ఆలయ ప్రాంగణంలో ఈరోజు గురువారం 150 మంది కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్సవినియోగించుకున్నారు ఈ సందర్భంగా లోకేష్ దాసాజీ, మాట్లాడుతూ కలిక్కం అనేది సిద్ధ వైద్యంలో కంటి వైద్యం. సిద్ధులు సంప్రదాయబద్ధంగా ఉపయోగించే కొన్ని అరుదైన మూలికల సారాలను కళ్లలో పూయడం వల్ల కింద పేర్కొన్న వ్యాధులన్నీ నయమవుతాయి.



1) దద్దుర్లు, గజ్జి, రింగ్‌వార్మ్, మొటిమలు, నల్ల మచ్చలు, దురద, సోరియాసిస్ మరియు విషం కాటు వంటి చర్మ సంబంధిత వ్యాధులను నయం చేస్తుంది. 2) దగ్గరి చూపు, దూరదృష్టి, మచ్చల క్షీణత, గ్లాకోమా, రెటీనా మరియు తలనొప్పి, కళ్ళలో నీరు కారడం వంటి వాటి నుండి ఉపశమనం పొందుతుంది. 3) ఋతుస్రావం సమయంలో స్త్రీలలో కడుపు నొప్పికి సంబంధించిన అన్ని సమస్యలకు పరిష్కారం పొందండి.

**వేదిక:** ఏకం ప్రాంగణం, బత్తలవల్లం, వరదయ్య పాలెం మండలము, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**సమయం:** ఉదయం 9:30 గంటల నుండి 11:00 గంటల వరకు. ఈ కార్యక్రమం ప్రతి నెల రెండవ గురువారం మరియు నాల్గవ గురువారం జరుగుతుంది.

## ఒంగోలు నగరంలో
### మౌళిక వసతులు మరియు మాస్టర్ ప్లాన్ అమలు కాకుండా.....
### స్మార్ట్ సిటీ ఎలా సాధ్యం ?
### ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ సభ్యులు కొల్లా మధు, మారెళ్ళ సుబ్బారావు



ఒంగోలు, (శుభోదయం న్యూస్ ): ఒంగోలు నగరంలో హెడ్ క్వార్టర్స్ ఎంత అభివృద్ధి మరియు పటిష్టంగా ఉంటుందో అంత జిల్లా మొత్తం కూడ దాని ప్రభావం ఉంటుంది. నగర మున్సిపాలిటీ ఏర్పాటు అయి 135 సంవత్సరాలు అయిన ఎందుకో ఒంగోలు పట్టణం అభివృద్ధి కార్పొరేషన్ స్థాయి అభివృద్ధి జరగకపోవడం అలాగే హెడ్ క్వార్టర్స్ లో ఒక్క యూనివర్సిటీ, ఆడిటోరియం, క్రీడా మైదానం, కొత్త పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, పూర్తి స్థాయిలో మంచినీటి సమస్య పరిష్కారం కాకపోవడం, నేషనల్ హైవే ల రోడ్డులు, %=ఒదీ% రోడ్లు కూడ ఇంకా పూర్తి స్థాయిలో జరగకపోవడం, నగరంలో ఎక్కడ కూడ పూర్తి స్థాయిలో పార్క్ లు లేకపోవడం, మాస్టర్ ప్లాన్ అనుగుణంగా అలాగే కార్పొరేషన్ స్థాయి పెద్ద పెద్ద రోడ్లు లేకపోవడం, మంచినీటి సమస్య ఎక్కడ కూడ నగర అభివృద్ధి పూర్తి స్థాయిలో ప్రణాళికలు లేకపోవడంతో రాజకీయ నాయకులు జోక్యం వలన నగరం అభివృద్ధికి వెనుకబడింది.నగర అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు 5 నుంచి 25 సంవత్సరాలు జనాభా అనుగుణంగా ప్లాన్, బడ్జెట్ లు రూపొందించే విధంగా ఉండాలి. అలాంటి పరిస్థితి కనబడటం లేదు కొన్ని తక్షణమే చేసేవి కొన్ని యుద్ధ ప్రాతిపదికన చేసేవి కొన్ని ఉంటాయి. అలాగే మన నగరం కూడ నిర్దిష్టంగా ప్రణాళికలు లేకపోవడంతో అందుకే ఇతర నగరాలు లాగ అభివృద్ధి అనుకున్న స్థాయిలో అభివృద్ధి పనులు జరగడం లేదు. ప్రణాళికలు రూపొందిస్తున్న దానికి తగ్గట్టుగా నిధులు మంజూరు చెయ్యాలి. అనుమతులు కూడ సంవత్సరాల సంవత్సరాలు అనుమతులు ఇవ్వడం కూడ ఆలశ్యం అవుతుంది. నగర ప్రజలు ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నారు ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా చూడవలసిన బాధ్యత మీ మీద ఉంటుందని ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ సభ్యులు కొల్లా మధు, మారెళ్ళ సుబ్బారావులు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు.

## ఎర్రవల్లి గ్రామం తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శం
### 50 వసంతాలు పూర్తి చేసుకున్న ఏకైక గ్రామం
### ఘనంగా సన్మానించిన సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు



హైదరాబాద్, (శుభోదయం న్యూస్ ): భగవంతుని పేరు చెపితే చాలు ఆ గ్రామంలో ప్రతి భక్తుడు కూడా భక్తితో పరవశిస్తారు. అందుకే అ గ్రామం గణపతి ప్రతిష్టించడంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నది. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీరామకోటి ధార్మిక సేవా సంస్థ వారు గురువారం



నాడు ఎర్రవల్లి హనుమాన్ భక్త మండలి వారిని శాలువా కప్పి సీతారాముల చిత్ర పఠాన్ని అందజేశారు సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు..ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవంతుని సేవలో తరించే భాగ్యం అందరికీ రాదన్నారు. 50 సంవత్సరాలనుండి గణపతిని ప్రతిష్టించారంటే వీరి భక్తి అమోగం అన్నారు తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శం ఎర్రవల్లి గ్రామం అన్నారు. గణపతి నవరాత్రులే కాకుండ ప్రతిరోజూ నామ సంకీర్తనలో పాల్గొనడం ఈ గ్రామం విశిష్టత అని కొనియాడారు.అనంతరం భక్తులు రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. మట్టి గణపతుల గురించి ప్రోత్సహించడం అయన రామభక్తికి నిదర్శనం అన్నారు.


## ఆటోలకు నంబరింగ్ లేకుంటే చర్యలు : ఎస్సై ఎన్.సందీప్ కుమార్



రేగొండ, (శుభోదయం న్యూస్): రేగొండ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆటోలకు సీరియల్ నెంబర్లు వేసుకోవాలని,నంబరింగ్ లేని ఆటొలపై చర్యలు తప్పవని స్థానిక ఎస్సై ఎన్.సందీప్ కుమార్ అన్నారు.గురువారం స్థానిక ఠాణాలో ఆటోలపై సీరియల్ నంబరింగ్ వేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నంబరింగ్ వల్ల ప్రమాద సమయంలో ఏదైన సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు గానీ,నేరాల నియంత్రణలో గానీ కేసును ఛేదించేందుకు సులభతరం అవుతుందన్నారు. ప్రయాణికులు సైతం ఆటోలను గుర్తించడం సులభతరం.కావున ప్రతి ఒక్కరూ బాధ్యతగా నంబరింగ్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లింగమూర్తి,కానిస్టేబుల్ శ్రీనివాస్, ఆటో యజమానులు పాల్గొన్నారు.

## పంచముఖ వినాయకునికి 108 రకాల నైవేద్యలు...
### ప్రత్యేక పూజలు అనంతరం దీపారాధన...





విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో ( శుభోదయం న్యూస్ ):గాజువాక. వినాయక నవరాత్రులు లో భాగంగా వడ్లపూడి లో ఉన్న పంచముఖ వినాయకుని ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం 108 రకాల నైవేద్యలు తో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం లో వినాయకుని నమూనా మరియు శంకు చక్రాలు, శివుని రూపం లో దీపారాధన కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని దీపాలంకరణ లో భాగస్వాములు అయ్యారు. ఈ కార్యక్రమం లో వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాధం పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు..ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు మింది గోవిందా, కర్రి కృష్ణ, గ్రామ పెద్దలు కన్నారెడ్డి .తాతనాయుడు,కారణం వెంకటరావు, కర్రి సన్యాసిరావు, ఈర్ల శ్రీరాములు, బోండా అప్పలనాయుడు, మింది పేరయ్య, మడక రాజు, 87 వార్డ్ టీడీపీ నాయకులు వార్డ్ అధ్యక్షులు రాజన్ రాజు, సీనియర్ నాయకులు పావడ రమణమూర్తి, కళ్యాణ్ చక్రవర్తి, కదుపుట్ల శ్రీను, గ్రామ మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## గొల్లపెటలో అంగరంగ వైభవంగా వినాయకుని నిమజ్జనం



విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతి పరిధిలో గల గోల్లపేట గ్రామంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు వియ్యపు పోతురాజు మరియు గ్రామ పెద్దలు వియ్యపు అప్పలరాజు ,వియ్యపు రమణ,వియ్యపు తాతారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిద్ది వినాయకునికి గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారుముందుగా నిమజ్జనం కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు ,కోలాటం ,నిర్వహించారు లడ్డు పాట నిర్వహించి లడ్డు దక్కించుకున్న వియ్యపు వెంకటరమణ లక్ష్మి దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు అనంతరం ముత్యాలమ్మపాలెం బీచ్ లో గణనాధుడిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వియ్యపు నరసింగరావు ,అప్పలనాయుడు ,చంద్రరావు ,ముత్యాలయ్య ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా ఇండస్ట్రీ పై కొమ్ముకాస్తున్న రాజకీయ వేత్తలు
### శవాల మీద చిల్లర వసూలు చేస్తున్న రాబందులు




విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో (శుభోదయం న్యూస్):అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ.జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ కార్మికులు ప్రాణాలు బలి తీసుకుంటున్న ఫార్మా ఇండస్ట్రీలు ఒకటి కాదు రెండు కాదు 250 పైన కంపెనీలు ఉన్నాయి రైతులు భూములు లాక్కొని కార్మికులు ప్రాణాలతో చలగాటలాడుతున్న ఈ ఇండస్ట్రీలు ఎక్కడో ఉండవలసిన కంపెనీలు పచ్చగా ఉండే పొలాల మధ్యకి తీసుకొచ్చిన రాజకీయవేతలు ఇష్ట సారంగా కంపెనీలు భద్రత లేని పరిమాణాలు ఎన్ని ప్రమాదాలు ముంచుకొచ్చిన సరే పట్టించుకోలేని అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహారం సంఘటన జరిగితే ఆందోళన దిగితే ఏదైనా సరే .లంచంతో విసిరేస్తున్న ఫార్మా ఇండస్ట్రీ వాళ్ళు.ఒకప్పుడు పచ్చగా ఉండే పొలాలను నాశనం చేసిన ఈ ఫార్మా ఇండస్ట్రీ. కంపెనీలకి వెళ్లాలంటే బాబోయ్ అని భయం మొదలైంది కార్మికులకు ఏ క్షణంలో ఏం జరుగుతుందో అని భయం పుట్టింది. అలాగే చుట్టుపక్కల ఉన్న గ్రామాలు కూడా ఇదే దిస్థితి మేలుకొలింది కంటిమీద నిద్ర కూడా లేకుండా బిక్కు బిక్కు మంటూ అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్న చుట్టుపక్క ఉన్న గ్రామాలు ఒక పక్క పొల్యూషన్ మరో పక్కన ఈ పేలుడు సంభాషణలు భద్రత పరిమాణాలు ఏ కంపెనీలో కూడా లేవు కెమిస్ట్రీలు కొత్తగా వచ్చిన వాళ్ళు కూడా ట్రైనింగ్ ఇవ్వకుండా ఏం తెలియకుండానే ఈ ఫార్మా



ఇండస్ట్రీలో జాబులు. రికమండేషన్ ద్వారా ఇస్తున్నారు. బి పి ఆర్ ప్రకారం ఇష్టాసారంగా రియాక్టర్ లో బ్యాచ్లు వేయడం టెంపరేచర్ చూసుకోకుండా వాక్యూమ్ కూడా చెక్ చేయకుండా ఇష్టసారంగా రియాక్టర్లు బ్యాచ్లు వేయడం వల్ల టెంపరెజర్ ఎక్కువ అవ్వడంతో రియాక్టర్ పేలుడు సంభవించడం జరుగుతుంది .ఈ ఫార్మా కంపెనీలు సరైన భద్రత లేకపోవడం వల్ల ఎందరో అమాయకమైన వర్కర్స్ ప్రాణాలు బలి తీసుకున్న కంపెనీలు. మొన్న జరిగినటువంటి సంఘటన అచ్యుతాపురం కూడా ఎంతోమంది ప్రాణాలు బలి తీసుకుంది నెలలు అవ్వకముందే పరవాడ సెనర్జీ కంపెనీ పేలుడు సంభవించింది కాంట్రాక్టులు ఎక్కడెక్కడ నుంచో కార్మికులు పనిస్తానని నమ్మించి తీసుకువచ్చి ఈ కంపెనీలలో బలి పశువుల ఏరా వేస్తుంది పాపం అమాయకమైన కార్మికులు పొట్టకూటి కోసం దిక్కుతోచలేని స్థితిలో ఈ కంపెనీలో ప్రాణాలు అర్పిస్తున్నారు అడిగేవాడు లేదని ఎంతోకొంత ముష్టిగా డబ్బులు విసిరేస్తున్నారు గట్టిగా మాట్లాడితే ఏదోలా నష్టపరిహారం చేస్తున్నారు. ఇవన్నీటిలోకి మూల కారణం ఎవరెవరికి అందాలో వారికి అందేలా ఇస్తున్నారు. ఫార్మా ఇండస్ట్రీలు వల్ల ఎందరో బడబడ రాబందులు ఈ ఫార్మా ఇండస్ట్రీ కి కొమ్ము కాస్తుంది. బతుకుతున్నారు. వీరి అండదండలుతో కొన్ని బడా చేతులు కూడా ఉన్నాయి ఏదైనా సంఘటన జరిగితే ముందస్తు మీరే వ్యవహరింపు లు!వివరాల్లోకి వెళ్తే! ఫార్మసిటీలో ఎడ్మిరల్ లైఫ్ సైన్స్ పరిశ్రమంలో అదృశ్యమైన వ్యక్తి మెథనైల్ ట్యాంకులో శవమై తేలాడు కనీసం కంపెనీ యాజమాన్యం ఏం జరిగిందని కూడా పట్టించుకోలేదు షిఫ్ట్ కి ఎంత మంది వస్తున్నారు అని కూడా లెక్క చేయడం లేదు హెచ్ఆర్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం వల్లే ఈరోజు ఈ సంఘటనకి మూల కారణం . రెండు రోజులు జరిగిన సంఘటన ఇప్పటివరకు వెలుగులోకి రాలేదు వాళ్ళ ఫ్యామిలీ కంపెనీ యాజమాన్యం అడిగిన తర్వాతే ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది . లేదు అనుకుంటే ఏమీ తెలియలేనట్టుగా కప్పిపుచ్చుకుంటారు. ఈ ఫార్మా ఇండస్ట్రీ వాళ్ళు ఎందుకంటే వీరు వెనకాల చుట్టూ ప్రజా ప్రతినిధులు కొమ్ముకాస్తున్నారు. ఇది నిజం !?

## కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి
### గోలివాడ ప్రసన్న కుమార్ డిమాండ్




రామగుండం: (శుభోదయం న్యూస్) : గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్న కుమార్ పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొదటగా గోలివాడ ప్రసన్న కుమార్ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మిమిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్ ఇచ్చిన హామీలను వీడియో ద్వారా ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ " సింగరేణి కాలరీస్ కంపెనీ పుట్టినప్పటి నుండి కార్మికులు వారి చెమటను, రక్తాన్ని చిందించి లక్షల కోట్ల రూపాయలు కంపెనీకి, ప్రభుత్వానికి ఆదాయాన్ని ఆర్జించి పెట్టారని, లక్ష మందికి పైగా కార్మికులు నేడు రిటైర్మెంట్ తరువాత వచ్చే పెన్షన్ లతో దీనావస్తలో జీవనం సాగిస్తున్నారని, ఇప్పటికి కేవలం 300 రూపాయలు, 1000 రూపాయల పెన్షన్ అందుకునే కార్మికులు, వారిపై ఆధారపడ్డ కుటుంబాలు ఉన్నాయని, ప్రస్తుతం 70,75 సంవత్సరాల వయస్సులో కుటుంబ పోషన కోసం కూలీ పనులకు, ఏదైనా దుకాణాలలో పనివాళ్లుగా సింగరేణీ రిటైర్డ్ కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రిటైర్ అయిన ప్రతీ సింగరేణి కార్మికునికి వృద్ధ వయసులో గౌరవప్రదంగా జీవించేలా వారందరికి కనీస పెన్షన్ 18,000 రూపాయలు చేయాలని, అలాగే 20,000 మందికి పైగా సింగరేణి కార్మికులు మారుపేర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి కుటుంబ సభ్యులు సింగరేణి ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు పొందడానికి, పెన్షన్లు తీసుకోడానికి, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సింగరేణీ కార్మికుల పిల్లలు వారసత్వ ఉద్యోగాల కోసం తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. మానవతా దృక్పధంతో సింగరేణీ కార్మికుల మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని అన్నారు. అంతేకాకుండా సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచి కోల్ ఇండియాలో ఇస్తున్న విధంగా హైపవర్ వేతనాలు ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కోటి ఇరవై లక్షల మంది సంఘటిత అసంఘటిత కార్మికులకు ఇప్పుడు వస్తున్న వేతనాలతో నెల గడవడం చాలా కష్టతరం అవుతున్నదని, నెలకు వారు అప్పులు చేయకుండా జీవించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, సంఘటిత అసంఘటిత కార్మికుల వేతనాలపై ఒక కమిటీని వేసి, వారి జీవన ప్రమాణాలు పెరిగే విధంగా, వేతనాలు పెంచడానికి కృషి చేయాలని అన్నారు. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కి జీవనాడి అని, తెలంగాణ రాష్ట్రం లో 16 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాలలో విస్తరించి ఉన్నదని, అన్ని నియోజనవర్గాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని సింగరేణి కార్మికుల సమస్యలను, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను, సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలను రాష్ట్ర సీయం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి కృషిచేయాలని బి.జనక్ ప్రసాద్ కి గోలివాడ ప్రసన్న కుమార్ గంగపుత్ర పత్రికా ముఖంగా బహిరంగ లేఖ విడుదల చేయడం జరిగింది..ఈ పత్రికా విలేకరుల సమావేశంలో ఎన్సీపీ పార్టీ జిల్లా నాయకులు చెన్నూరి నాగరాజు, విద్యార్థి నాయకులు నాగుల శివకుమార్, యువజన నాయకులు మొలుగూరి మహేష్, కుమ్మరి నాగార్జున, అక్కపెల్లి చంద్రశేఖర్ ఆజాద్, పొడిషెట్టి మణిదీప్, మహిళా నాయకురాళ్లు గోలివాడ సరిత, గుంటి విజయలక్ష్మి, బద్రి లక్ష్మి, మామిడిపల్లి రాజేశ్వరి, ఇరుకుల్ల లక్ష్మీ, కాంపెల్లి శంకరమ్మ, దానవేన రమ తదితరులు పాల్గొన్నారు.

## వగ్గంపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన పోషకాహార మాసోత్సవాలు



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం వి ఎస్ పార్వతి అధ్యక్షతన పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న, వయసును బట్టి బరువు, ఎత్తు పెరగాలన్న సమతుల ఆహారం తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే గుడ్లు, చికీలు, రాగిజావ తో పాటు పండ్లు కూరగాయలు చిరుధాన్యాలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో ఎక్కువమందికి రక్తహీనతకు



గురవుతున్నారని అలాంటివారు పౌష్టికాహారం కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, క్యాల్షియం, ఫైబర్, ఐరన్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు ఉండే పదార్థాలు వాడాలని అన్నారు. కార్యక్రమం అనంతరం వగ్గంపల్లి ఎస్టి అంగన్వాడి కేంద్రం నందు పోషకాహార ఆవశ్యకతపై తల్లులకు, గర్భిణీలకు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఎం.ఎల్ హెచ్ పి మౌనిక, అంగన్వాడీ కార్యకర్తలు దేవిశ్రీ, లక్ష్మి, సునీత, ఈశ్వరమ్మ, రామాంజమ్మ, సుశీల, మరియమ్మ, పాఠశాల విద్యార్థులు గర్భిణీలు బాలింతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన జూపూడి ప్రభాకర్ రావు



తాడేపల్లి, (శుభోదయం న్యూస్ ): మాజీ ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు కలిసి రాష్ట్రం లోని పార్టీ విషయాలు ప్రత్యేకంగా ప్రకాశం జిల్లాలోని పార్టీ విషయాలను చర్చించారు.ప్రకాశం జిల్లాలో పార్టీ పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించవలిసిన విధానాలు గురించి మాట్లాడారు.ప్రకాశం జిల్లాలోని నాయకులతో సమావేశం నిర్వహించిన తదుపరి పలు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది అని జగన్ తెలియజేసారు.

# వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన డిఎస్పి, సిఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది



ఎల్లారెడ్డి, (శుభోదయం న్యూస్ ): పట్టణ కేంద్రం లోని నాయబాది గణేష్ మండలి వద్ద నేడు జరిగిన అన్నప్రసాద కార్యక్రమం లో పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన ఎల్లారెడ్డి డిఎస్పి,సిఐ,ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా వారిని నాయబాధి గణేష్ మండలి తరపున సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గణేష్ మండలి అధ్యక్షుడు శ్రీ కొండాపూర్ వెంకటేశం, సెక్రటరీ వినోద్ కుమార్, కోశాధికారి చిరంజీవి, 2వ వార్డు కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్, అడ్వకేట్ గోపాల్ రావు, గంగారామ్ సార్, కృష్ణమూర్తి సార్, కృష్ణారెడ్డి, ఆదిమూలం సతీష్, మోహన్ గౌడ్, రవి గౌడ్, మనోజ్, నారాయణ సెట్, డాక్టర్ సాయిలు, మరియు కాలని వాసులు పాల్గొన్నారు.

# విగ్నేశ్వరుని లడ్డు పాట దక్కించుకున్న మెంటా నరసింహారావు





ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటు చేసినటువంటి విఘ్నేశ్వరుని లడ్డుతో కూడిన 75 గ్రాముల వెండి విఘ్నేశ్వరుని ప్రతిమను పాట ద్వారా దక్కించుకున్న పట్టణ టిడిపి యువ నాయకులు మెంటా నరసింహారావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డు పాట తనకు దక్కడం విగ్నేశ్వరుని ఆశీర్వాదంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, ఏల్చూరి బాలకొండలరావు, గాదం శెట్టి గురు నారాయణ, మెంటా ఆనంద్, ముప్పసాని రాఘవ, కారం శెట్టి నారాయణ, ఈనాడు గోపాల్, సోమిశెట్టి శ్రీనివాసులు, సరాబు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని లడ్డు ప్రసాదమును దక్కించుకున్న కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి



కనిగిరి ఆర్ సి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): కనిగిరి పట్టణంలోని కొత్తపేటలో గణపతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం నిమజ్జనం సందర్భంగా వినాయకుడి లడ్డు ప్రసాదం పాటా ఏర్పాటు చేశారు. దీనిలో భక్తులు విరివిగా పాల్గొన్నారు. ఈ లడ్డు పాట 1,30,116 రూపాయలకు కనిగిరి జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి దగ్గించు చుకున్నారు. ఈ లడ్డు పాట వరుసగా మూడోసారి దక్కించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు మడతల కస్తూరి రెడ్డి అన్నారు.

# సబ్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీవో టివిఎన్ లక్ష్మి




కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను గురువారం నూతనంగా ఆర్టిఓగా బాధ్యతలు చేపట్టిన టీవీఎన్ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఐ షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

# ఆకుపాటిని ఘనంగా సన్మానించిన గణేష్ విగ్రహ కమిటీ సభ్యులు



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధి లో ఆకుపాటి రమణయ్య నివాసం వద్ద ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుని మండపం వద్ద విగ్నేశ్వరునికి ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు, భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గణేష్ వేడుకలకు సహకరించిన ఆకుపాటిని విగ్రహ కమిటీ సభ్యులు పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఐదవ రోజు బుధవారం టిడిపి యువ నాయకులు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ మిత్రుల ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమం మేళ తాళాలతో , టపాకాయల శబ్దాలతో, డీజే సౌండ్ తో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుపాటి మిత్రులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి మరణంతో పేదల సూర్యుడు అస్తమించాడు



గుంటూరు: (శుభోదయం న్యూస్) : పేద, బడుగు, బలహీన వర్గాల, పీడిత, తాడిత ప్రజల పోరాట యోధులు , కార్మిక, కర్షక పక్షపాతి, విద్యావంతులు , సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంతో పేదల సూర్యుడు అస్తమించాడని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు.అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూసిన సీతారాం ఏచూరి మరణం పట్ల అయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమ నాయకుడిగా ఎదిగి తన జీవిత పర్యంతం ప్రజల కోసం అవిశ్రాంతగా పోరాడిన యోధుడు ఏచూరి అంటూ కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు నిలబడే సీతారాం ఏచూరి లాంటి నేతలు ఉద్యమాల్లో, రాజకీయాల్లో అరుదుగా ఉంటారన్నారు. సీతారాం ఏచూరి మరణంతో దేశం ఒక రాజకీయ స్తిత ప్రజ్ఞుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరికి కన్నీటి నివాళులర్పిస్తూ వారి ఆత్మకు సద్గతి కలగాలని ఆళ్ళ హరి భగవంతుడుని కోరారు.

# ఘనంగా పోషణ మాసోత్సవాలు

## సమతుల ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి మూలం

## ఐసిడిఎస్ సూపర్ వైజర్ లక్ష్మి దేవమ్మ



తనకల్, (శుభోదయం న్యూస్): తనకల్లు మండలంలోని టి.సదుం గ్రామ పంచాయితీ యర్ర చెరువు పల్లి అంగన్ వాడి కేంద్రంలో ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపర్వైజర్ లక్ష్మీదేవమ్మ



మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా లభించే పౌష్టిక ఆహారాన్ని క్రమం తప్పకుండా తప్పనిసరిగా తినడం వలన పిల్లలకు పౌష్టికాహార లోపం ఏర్పడదు అనిసూచించారు. కేవలం కూరగాయలు, ఆకు కూరలు , పండ్లు, చిరుధాన్యాలు విరివిగా వాడాలని సూచించారు. గర్భవతి కాలంనుండి బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు అంగన్ వాడి అందించే పౌష్టికాహారం ప్రతిరోజు తీసుకుని ఆరోగ్య వంతులుగా వుండాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో లభించే బాలామృతం ని ఆరునెలలు నిండిన నుండి మూడు సంవత్సరముల వరకు అందించడం జరుగుతుంది. బాలామృతంలో అనేకరకాల పోషక విలువలు కలిగి ఉన్నదని రోజు బిడ్డకు వంద గ్రాముల చొప్పున అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గర్భవతులు, బాలింతలుకు ఆహారం, పరిశుభ్రత, పిల్లల పెరుగుదల, బాలామృతం గురించి అవగాహన కల్పించారు. గర్భవతులు, బాలింతల గృహాలను సందర్శించారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ వి.లక్ష్మీదేవమ్మ , అంగన్వాడి వర్కర్లు , ఆశా వర్కర్లు , గర్భని స్రీలు , పిల్లలు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వరద బాధితులకు 75,000, విరాళం ఇచ్చిన శ్రీ శారద హై స్కూల్ కరస్పాండెంట్ శ్రీ వాణి సనత్ కుమార్





తనకల్లు, (శుభోదయం న్యూస్) : విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా ములకలచెరువులోని శ్రీ శారద విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ శ్రీ వాణి సనత్ కుమార్ గారు 55,000/- మరియు ఆక్స్ ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్, ములకలచెరువు. ప్రిన్సిపాల్ సిద్ధారెడ్డి గారు 20,000/- తంబళ్లపల్లి %ు.ఙూ%. ఇన్చార్జ్ గౌరవనీయులైన దాసరి జయ చంద్రారెడ్డి గారికి మొత్తం 75,000/- (డెభై అయిదు వేలరూపాయలు) %జ.వీ%. రిలీఫ్ ఫండ్ విజయవాడ వరద బాధితుల సహాయార్థం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ములకలచెరువు మండలం ఎంఈఓ 1 వెంకటరమణ, ఎంఈఓ 2 శంకరప్ప, హరి, మరియు శ్రీ శారద హై స్కూల్ ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు మరియు ఆక్స్ ఫర్డ్ స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# ఆరేళ్ల చిన్నారిని ఢీ కొట్టిన వ్యాన్

## ప్రైవేటుకి వెళ్లిన పాప మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరు అవుతున్న తల్లి




బుచ్చయ్యపేట, (శుభోదయం న్యూస్): బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి గ్రామంలో నివాసముంటున్న మహాలక్ష్మి నాయుడు వృత్తి రీత్యా తాపీ మేస్త్రి గా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. గొన్న షర్మిల అనే ఆరు సంవత్సరాల చిన్న పాప వుంది. పాపని ఎంతో అల్లరు ముద్దుగా పెంచుకుంటున్నాడు. స్కూల్ నుండి ఇంటికి వచ్చి తన తండ్రితో ఆడుకుని ప్రైవేట్ కి వెళుతున్న అని ఇంటి నుండి బయలుదేరిది బయలుదేరిన పది నిమిషాల్లో పాపని రోడ్డుమీద వ్యాన్ గుద్దేసింది అనే వార్త వెంటనే ఘటన స్థలానికి వెళ్లేసరికి చనిపోయి రోడ్డు మీద పడి ఉన్న షర్మిల చూసి కన్నారు మున్నారు అవుతున్న తల్లిదండ్రులు గ్రామ ప్రజలు. ఒకవేళ పాప బ్రతికే ఉంది అనుకొని పాపని రావికమతం గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకొని వెళ్లగా చనిపోయింది అని చెప్పారు. గుద్దిన వెంటనే వ్యాన్ డ్రైవర్ దిగి పాపని పట్టుకొని చనిపోయింది అనే విషయం తెలుసుకొని వెంటనే అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు అని చూసిన వ్యక్తులు చెప్తున్నారు. వ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నారు సాయంత్రంకి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని ఎస్ఐ డి ఈశ్వరరావు తెలిపారు.

# ఏపీ మోడల్ స్కూల్ తనిఖీ



నల్లచెరువు, (శుభోదయం న్యూస్ ) : మండల పరిధిలోని ఏపీ ఆదర్శ పాఠశాలను గురువారం వైద్య సిబ్బంది సి హెచ్ ఓ రామచంద్రారెడ్డి తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండు వంట మనుషులకు పరిశుభ్రతపై తగిన సూచనలు సలహాలు తెలిపారు.వంటగదిలను,వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.గోర్లు కత్తిరించుకొని, తలనీలాలు వేలాడకుండా జాగ్రత్తగా జడలు వేసుకోవాలని సూచించారు.వంట చేయుటకు మినరల్ నీటిని వినియోగించాలని తెలిపారు. వంటకు వాడే కూరగాయలను పరిశుభ్రంగా శుభ్రపరిచి తర్వాత ఉపయోగించాలన్నారు. బియ్యం శుభ్రంగా ఒకటికి రెండుసార్లు శుభ్రపరిచి వంట వండాలన్నారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన నిర్వహించారు.సీజనల్ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియపరచారు. విద్యార్థులు ఎవరైనా జ్వరాలు, విరోచనాలు,జెలుపు వంటి వాటితో బాధపడుతుంటే సంబంధిత ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం ఎల్ హెచ్ పి.హరిత, ఏఎన్ఎం భాగ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి,ఆశా కార్యకర్తలు ప్రభావతి,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో గంజాయి డోర్ డెలివరీ చేస్తున్న యువకుడు అరెస్ట్



స్టేట్ బ్యూరో (శుభోదయం న్యూస్)తిరుపతిలో గంజాయి డోర్ డెలివరీ చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.నగరి మండలం ఓజీ కుప్పానికి చెందిన యువకుడు ... చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి రవాణా చేయడంతో పాటు విక్రయాలు చేస్తున్నారు. తిరుపతి ఏజెన్సీలో గంజాయిని కిలో రూ.10 వేలకు కొని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి రూ. 300కు అమ్ముతున్నారు. గంజాయి కావాలని ఫోన్ చేస్తే స్విగ్గీ బాయ్‌గా వెళ్లి విక్రయాలకు పాల్పడుతున్నారు. పక్కా సమాచారంతో తిరుపతి మారుతీనగర్ కొత్తపల్లి క్రాస్ వద్ద నిఘా పెట్టి అతన్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# బాధితులందరినీ అన్ని విధాలా ఆదుకుంటాం

## అర్హులైన వారందరికీ నష్టపరిహారం అందించేలా కృషి చేస్తా

## ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ రూరల్,(శుభోదయం న్యూస్):గతంలో ఎన్నో వరదలను చూశామని కాని ఈసారి వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చెప్పారు. అయితే బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో అధికార యంత్రాంగం అహర్నిశలు పనిచేసి సహాయ చర్యలు కొనసాగిస్తోందని ఆమె పేర్కొన్నారు. గురువారం నాడు నందిగామ మండలంలోని కంచల, అంబారుపేట, ఐతవరం గ్రామాల్లో అధికారులు, కూటమి నేతలతో కలసి పర్యటించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ, ఇంతటి విపత్తులో బాధితులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. చంద్రబాబు ఈ వయసులోనూ ప్రజల కోసం ఎంతో శ్రమిస్తున్నారని, బాధితులకు అన్ని విధాలా సహాయక చర్యలు అందేలా ఆదేశాలు ఇస్తున్నారని అన్నారు. వరద బాధితులకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు వంట నూనె, కిలో పంచదార, 2 కిలోల ఉల్లి పాయలు, 2 కిలోల బంగాళా దుంపలను రెండు సంచుల్లో వేసి పంపిణీ చేస్తున్నామన్నారు. కంచల గ్రామంలో స్వయంగా సరుకులను పంపిణీ చేసారు. ప్రతి ఇంటికి నిత్యావసర సరుకుల పంపిణీ 100 శాతం జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశాము. వరి రైతులు పెద్ద మొత్తంలో నష్టపోయారని ప్రతి రైతుకు నూరుశాతం నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. కంచల చెరువుకు గండి, మెయిన్ రోడ్డుపై గండి పడటం వల్ల ఎటు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని, భారీ వరదలొచ్చిన ప్రతిసారీ అంబారుపేట-ఐతవరం వద్ద జాతీయ రహదారి బ్లాక్ అవుతుందని దీనికి శాశ్వత పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో జాతీయ రహదారి ఆరులైన్లుగా విస్తరణ చెందుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఒక బ్రిడ్జి ప్రతిపాదన తీసుకుని చర్యలు చేపట్టనున్నట్లు తంగిరాల సౌమ్య స్పష్టం చేసారు.


# కుసంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే స్వీపర్లు




టేక్మాల్, (శుభోదయం న్యూస్):మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే స్వీపర్లుగా మారారు. శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో ప్రతిరోజు విద్యార్థులు వంతుల వారిగా పాఠశాల గదులతో పాటు, వరండా సైతం శుభ్రం చేసే డ్యూటీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్వీపర్లను ఏర్పాటు చేసినప్పటికీ స్థానిక పాఠశాలలో స్వీపర్లు లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# వినాయక విగ్రహాన్ని దర్శించుకొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్



గోదావరిఖని టౌన్, సెప్టెంబర్12, (శుభోదయం న్యూస్) : గోదావరిఖని బాపూజీ నగర్‌లో గోదావరిఖని కా రాజా యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేష్ విగ్రహాన్ని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులకు అన్నదానం చేశారు.



కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ గణేషుడు ఆశీస్సులతో 29వ డివిజన్ ప్రజలకు అవసరమైన అన్ని పనులు మున్సిపల్ ద్వారా చేశానని, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సహకారంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని, గణపతి దేవుడు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు, ప్రజలందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, రానున్న రామగుండం పూర్తి స్థాయిలో మరింత అభివృద్ధి చెందేలా ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, మనం చేసే పూజా కార్యక్రమాలే తప్పకుండా సత్ఫలితాలు ఇస్తాయని, ప్రజలందరూ ఐకమత్యంగా ఉంటూ రామగుండం నియోజక వర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుడుదుల శివ, మిడిదొడ్డి ప్రవీణ్, సురేష్, సోహెల్‌తోపాటు గోదావరిఖని కా రాజా వినాయక యూత్ పెద్దలు బూదవ్వ, పెరక రామస్వామి, మేకల మల్లయ్య, కవ్వంపల్లి కిష్టయ్య, తిరుపతి, రవి, రాజేందర్, సతీష్, శ్రీకాంత్‌తోపాటు గోదావరిఖని కా రాజా యూత్ అధ్యక్షుడు కవ్వంపల్లి వినయ్, నాయకులు రాంకిరణ్, హరీష్, పెరక అశోక్, పవన్, సాయి, రఘు, శ్రీను, హరీష్ రెడ్డి, రాజేందర్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బహుమతులు అందజేత



పాపన్నపేట, (శుభోదయంన్యూస్):పాపన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన (ఎస్జీఎఫ్)స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి మెదక్ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు విచ్చేసి విద్యార్థులకు బహుమతులు ప్రధానం




చేశారు.కబడ్డీ,ఖోఖో,వాలీబాల్,విద్యార్థుల క్రీడా పోటీలకు పాపన్నపేట నరేందర్ గౌడ్ అన్నదాతగా సహకారం అందించారు.ఇందులో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్,వ్యాయమ ఉపాధ్యాయులు రమేష్,ఉపధ్యాయులు నాగరాజు,కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి,శ్రీకాంత్ అప్ప,గోవింద్,ప్రశాంత్ రెడ్డి,మాజీ కోఫ్షన్ గౌస్ తదితరులు ఉన్నారు.

# ఆర్థిక సాయం చేసిన కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి




పటాన్చెరు, (శుభోదయం న్యూస్): బొల్లారం మున్సిపల్ ప్రాంతంలోని జ్యోతి నగర్ కాలనీ వాసి ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి తుఫాన్ నాయక్ గుండె నొప్పి వచ్చి బుధవారం రాత్రి చనిపోవడం జరిగింది. అతని వయసు 24 సంవత్సరాలు చనిపోయిన వ్యక్తి అన్నయ్య దీపక్ నాయక్ కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ని కలిసి మా తమ్ముడు గుండె నొప్పి వచ్చి చనిపోయాడు సార్ పొట్ట చేతిలో పట్టుకుని వచ్చి పని చేసుకునే వాళ్ళం సార్ మాకు ఏదైనా సాయం చేయమని కోరగా కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి తన మాటలు విన్న తర్వాత చలించి తన వంతుగా అంత్యక్రియల కోసం పదివేల రూపాయలు సహాయం చేయడం జరిగింది. తుఫాన్ నాయక్ కుటుంబ సభ్యులు నిజంగా ఓ దేవుడిగా మమ్మల్ని ఆదుకుంటున్నావు సార్ అని కృతజ్ఞతలు తెలిపారు. ఆనంద్ కృష్ణారెడ్డ ఒక మనిషిగా మరో మనిషి కష్టాలు ఉన్నప్పుడు ఆదుకోవడం నా భాధ్యతగా భావిస్తున్నాను అని ఈ సందర్భంగా వారితో అన్నారు.

# గణేష్ మండపాలను దర్శించుకున్న...

## మున్సిపల్ వైస్ చైర్మన్ అంతి రెడ్డి గారి అనీల్ రెడ్డి రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో గణేష్ నవరాత్రులు కన్నుల పండువగా సాగుతున్నాయి. స్థానిక జ్యోతినగర్'లో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద నిర్వాహకులు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి పాల్గొని భక్తులకు అన్నదాన వితరణ



చేశారు. తదనంతరం బాలాజీ నగర్ గణేశుడికి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు బాలాజీ నగర్ లో ఏర్పాటుచేసిన గణేష్ మండపాని రాష్ట్ర కార్మిక నాయకులు వి వరప్రసాద్ రెడ్డి మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాబాలాజీ నగర్గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి అనిల్ రెడ్డి వరప్రసాద్ రెడ్డిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నిహారిక ప్రత్యూష రాజశేఖర్ రెడ్డి సాయి తేజ జాకీర్ రూపేష్ సతీష్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు యువకులు కాలనీవాసులు భక్తులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ పట్ల అనుచిత వ్యాఖ్యలు మాట్లాడినందుకు నిరసనగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో దేశ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారు ఇతర దేశాలలో ఉండి భారతదేశ పట్ల ప్రధాని మోడీ పట్ల అనుచిత వాక్యాలు మాట్లాడినందుకు నిరసనగా రాహుల్ గాంధీ గారి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు మహిళా మోచ నాయకులు వివిధ అసెంబ్లీలు వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# స్టేట్ లెవెల్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన కృష్ణవేణి వికాస్ కాలేజ్ స్టూడెంట్స్

## జిల్లా స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచిన రేపాల వంశీకృష్ణ,బుర్ర సిద్దు, మంద కౌశిక్




గోదావరిఖని టౌన్, (శుభోదయం న్యూస్ ):ఆటపాటలతో విద్యార్థులకు నూతన ఉత్సాహం ఉరకలేస్తుంది అని అన్నారు కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల. ఈ మేరకు గురువారం పత్రిక ప్రకటనలో జిల్లా స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఇంటర్ ద్వితీయ,ప్రథమ సంవత్సరం చదువుతున్న రేపాల వంశీకృష్ణ ,బుర్ర సిద్దు, మంద కౌశిక్ ఈనెల 21, 22, 23వ తేదీలలో సిరిసిల్ల రాజన్న జిల్లాలో నిర్వహించే స్టేట్ లెవెల్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రెట్టింపు ఉత్సాహంతో అత్యద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయిలో సైతం మెడల్స్ సాధించి విజేతలుగా నిలవాలని "ఆల్ ద బెస్ట్" తెలిపారు కళాశాల చైర్మన్. కళాశాల డైరెక్టర్ తో పాటుగా ప్రిన్సిపల్ ఎం వెంకన్న, అకాడమిక్ ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్, లెక్చరర్లు మరియు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రేపాల వంశీకృష్ణ, సిద్దు, కౌశిక్ లను అభినందించారు.

# నర్సాపూర్ బస్ డిపో ఇంచార్జ్ లక్ష్మణ్ కి వినతి పత్రం ఇచ్చిన బిజెపి అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): ఈరోజు బస్ డిపో ఇంచార్జ్ లక్ష్మణ్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. నర్సాపూర్ నుండి ఇమామ్ నగర్ సోలక్ పల్లి రాళ్లకత్వ శివానగర్ మీదుగా పటాన్చెరు వచ్చే బస్సులు పొద్దున సాయంత్రం ఒకటే ట్రిప్పు రావడంతో విద్యార్థులు ఉద్యోగస్తులు వ్యాపారవేత్తలు ఇతర ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని డిపో మేనేజర్ గారిని నర్సాపూర్ బస్ డిపో నూతనంగా ప్రారంభమై నుండి రోజుకు 17 ట్రిప్పులు బస్సులు నడపేవారు అదేవిధంగా రోజు కూ 17 ట్రిప్పులు బస్సులు నడపాలని జిన్నారం మండల బిజెపి అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి హిమనగర్ సీనియర్ నాయకుడు బిక్షపతి నర్సింలు కుమార్ బస్ డిపో వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# సెప్టెంబర్ 14 న జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి



కనిగిరి ఆర్శి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్ ):జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 14 వ తేదీన కనిగిరి కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కనిగిరి కోర్టు న్యాయమూర్తి,మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె. భరత్ చంద్ర వెల్లడించారు.పోలీసులు రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు.లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు.కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలో మిథనాల్ ట్యాంకులో శవమై తేలాడులి




విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో( శుభోదయం న్యూస్ ):అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలో అదృశ్యమైన ఉద్యోగి గురువారం ఉదయం మిథనాల్ ట్యాంకులో శవమై తేలాడు. కర్మాగారంలో ప్రొడక్షన్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన రంది సూర్యనారాయణది హత్య ఆత్మహత్య లేక ప్రమాదమా అనేది తేలాల్సి ఉంది. అటు మృతుని కుటుంబ సభ్యులు కంపెనీ యాజమాన్యం ఉద్యోగి అదృశ్యంపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగి కంపెనీలో నుండి వెళ్లిపోయినట్లు చెప్పిన తోటి ఉద్యోగులు . కనిపించకుండా పోయినా సూర్యనారాయణ గురువారం అదే కంపెనీలో శవమై తేలడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతునిది హత్య ఆత్మహత్య ప్రమాదమా అనేది తేడాల్సింది .విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు శుక్రవారం కర్మాగారం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆందోళనకు దిగారు.సూర్యనారాయణ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి న్యాయం చేయాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మృతుని కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జగన్నాథం,తదితర నాయకులు కర్మాగారం వద్దకు చేరుకొని మృతుని కటుంబానికి సంఘీభావం తెలిపారు. అనంతరం మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించే విషయంపై. యాజమాన్యంతో చర్చలు జరిపారు. రూ "50 లక్షలు నష్టపరిహారం ఇవ్వడానికి, దహన సంస్కారానికి ఒక లక్ష రూపాయలు చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించింది. మృతదేహాన్ని శవ పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు.

# .గణపతి నిమర్జన కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్!



టంగుటూరు (శుభోదయం న్యూస్) : మేజర్ పంచాయతీ పరిధిలోని వెంకటాయపాలెం ఎస్ టి కాలనీలోని గణపతి నిమర్జన కార్యక్రమంలో టంగుటూరు మండల మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు గావించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మరియు టిడిపి శ్రేణులు పాల్గొనడం జరిగింది.

# వరద బాధితులకు

## కందుకూరు నియోజకవర్గ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ 2 లక్షల విరాళం



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపుమేరకు, కందుకూరు నియోజకవర్గ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల కోసం 2 లక్షల రూపాయల విరాళాన్ని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ కి ఈరోజు అందజేయడం జరిగింది.

# ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ



నల్లచెరువు, (శుభోదయం న్యూస్): మండల పరిధిలోని అల్లుగుండు సచివాలయంలో మండల వ్యవసాయ అధికారి భారతి ఆధ్వర్యంలో గురువారం రైతులకు ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ రాజశేఖర్ హాజరయ్యారు.ఈ విత్తన పంపిణీ కార్యక్రమంలో 80 శాతం రాయితీతో రైతులకు ఉలవలు,తదితర ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ విత్తనాలు కావలసినవారు తమ తమ గ్రామ వ్యవసాయ అధికారులను సంప్రదించి తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో ముళ్ళకంపల తొలగింపు



నల్లచెరువు, (శుభోదయం న్యూస్) : మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సుమియా భర్త సద్దాపల్లి రఫీ తన సొంత నిధులతో రోడ్డుకిరువైపులా పెరిగిపోయిన ముళ్ళకంపలను తొలగింపజేశారు. స్థానిక మండల కేంద్రంలోని ఫాతిమా మజీద్కు వెళ్ళు రోడ్డు నందు ఇరువైపులా ముల్లకంపలు పెరిగిపోవడంతో వాహనదారులు, పాదచాదకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు.దీని గుర్తించిన ఎంపీటీసీ భర్త రఫీ తన సొంత నిధులతో గురువారం రోడ్డుకి ఇరువైపులా ముళ్ళకంపలను తొలగింప చేశారు.పెరిగిపోయిన ముళ్ళకంపలను తన సొంత నిధులతో తొలగించడంతో వీధిలోని ప్రజలందరూ ఎంపీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

# గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు




లింగంపేట, (శుభోదయం న్యూస్ ): మండల కేంద్రంలో గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లను పరిశీలించిన సిఐ రవీందర్ నాయక్ యెల్లరెడ్డి, ఎస్ఐ అరుణ్,ఎమ్ఆర్ఓ రాజా రవీందర్, ఎంపీడీఓ నరేష్ , మండల అధికారులు , కరెంట్ ఏఇ హరీష్ రావ్, అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శి ఈ మధ్యాహ్నం



అంబేద్కర్ విగ్రహం నుండి వినాయకుడు నిమజ్జన పాయింట్ 2-కిలోమీటర్ల మార్గాన్ని పరిశీలించి , తక్కువ-వేలాడే వైర్లను గుర్తించడం జరిగింది. తధితర సమస్యల పరిష్కరాలను గూర్చి చర్చించడం జరిగింది.

# కందుకూరు ఆర్టీవోగా బాధ్యతలు చేపట్టిన టి.వి.ఎన్ లక్ష్మి



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారిగా టి.వి. ఎన్ లక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందుకూరు లో ఉన్న మోటారు వాహనముల తనిఖీ అధికారి వారి కార్యాలయమును రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి వారి కార్యాలయంగా మార్చడం జరిగిందని ఆమె తెలిపారు. ఆమె చిలకలూరిపేట నందు మోటార్ వాహనాల తనిఖీ అధికారిగా పనిచేస్తూ పదోన్నత కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారిగా రావడం జరిగిందని ఆమె తెలిపారు. ఇకపై కందుకూరు చుట్టుపక్కల వాహనదారులకు ప్రతి చిన్న పనికి జిల్లాకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మరిన్ని సేవలు అందించడం జరుగుతుందన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసింది

## మాజీ శాసనసభ్యులు పెద్దపెల్లి జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్



రామగుండం, సెప్టెంబర్12, (శుభోదయం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో రైతంగానికి పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ అమలు చేయాలి. ఎన్నికల సమాయంలో తాము అధికారంలోకి వస్తే 2 లక్షల రుణమాఫీ చెస్తామని కాంగ్రెస్ పార్టీ సిఎం రెవంత్ రెడ్డి హామి ఇచ్చి అధికారంలోకి వవ్చారు. అధికారంలోకి వచ్చాకా రైతులను మ్షెసం చెస్తు రుణమాఫీ అమలు చేయకుండా రైతులను మ్షెసం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా తెలంగాణ రైతంగానికి 2 లక్షల రుణమాఫీ చేయాలని పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ పక్షానా డిమాండ్ చేస్తున్నమని మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. అర్హులైనా వారందరికి 2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని శనివారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించనున్నమని పెర్కోన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు కోప్పుల ఈశ్వర్, మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ పుట్టమధుకర్ పెద్దపల్లి మాజీ శాసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి హాజరుకానుకన్నారని మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ తెలిపారు.



# ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

రేగొండ, (శుభోదయం న్యూస్):రేగొండ నుండి కొత్తపల్లికి తిరిగి వెళ్తుండగా భూపాలపల్లి నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనం పై ఉన్న రేగొండ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మెరుగు రవీందర్(35) మృతి..మృతునికి భార్య మనిషా కుమారుడు,కూతురు ఉన్నారు..పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

# తెలంగాణ హైకోర్టులో ప్రభుత్వానికి ఊరట




విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి బకాయిల చెల్లింపుపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో 261 కోట్లు చెల్లించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఫిర్యాదు చేయడంతో తెలంగాణ డిస్కమ్‌లు విద్యుత్ కొనుగోలు బిడ్‌లో పాల్గొనకుండా నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. ఉదయం నుంచి విద్యుత్ కొనుగోలుకు బిడ్లు వేయకుండా పవర్ ఎక్స్ఛేంజీలు నిలిపివేశాయి.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసింది. విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నిర్ణయంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వాన్ని విద్యుత్ బిడ్డింగ్‌కు అనుమతించాలని ఆదేశించింది. దీంతో విద్యుత్ కొనుగోలు బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వానికి అడ్డంకి తొలగింది.

# మరో 10 వందే

## భారత్ రైళ్లు లాంచ్.. 15న ప్రారంభించనున్న మోడీ



ఇండియాలో మరో 10 కొత్త వందే భారత్ రైళ్లు పట్టాలపై పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే దేశ వ్యాప్తంగా పలు వందే భారత్ రైళ్లను కేంద్రం ప్రవేశపెట్టింది.ఈనెలలోనే మరో 10 కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను సెప్టెంబర్ 15న ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు.రాబోయే రైళ్లు టాటానగర్-పాట్నా, వారణాసి-దియోఘర్, రాంచీ-గొడ్డ, దుర్గ్-విశాఖపట్నం, టాటానగర్-బెర్హంపూర్ (ఒడిశా), రూర్కెలా-హౌరా, హౌరా-గయా, ఆగ్రా-వారణాసితో సహా కీలక మార్గాల్లో కనెక్టివిటీని మరింత విస్తరింపజేయనున్నాయి. రైల్వే వ్యవస్థను ఆధునీకరించే భాగంగా ఈ కొత్త రైళ్లను ప్రవేశపెడుతున్నారు. ఈ రైళ్లు హై-స్పీడ్ సామర్థ్యాలు కలిగి ఉంటాయి. అంతేకాకుండా అధునాతన సౌకర్యాలు ఏర్పటు చేశారు. ప్రతి సీటు దగ్గర మొబైల్ ఛార్జింగ్ ఇచ్చారు. ఇటీవలే ప్రధాని మోడీ మూడు కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. మీరట్ నుంచి లక్నో, మధురై నుంచి బెంగళూరు, చెన్నై నుంచి నాగర్‌కోయిల్‌లను కలుపుతూ రైళ్లు ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ ఈ రైళ్లు ప్రారంభమయ్యాయి.

# సంచలన తీర్పు: ఐదేళ్ల బాలికపై హత్యాచారం కేసు దోషికి ఉరిశిక్ష



సంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఐదేళ్ల బాలికపై హత్యాచారం కేసులో దోషికి జిల్లా కోర్టు ఉరిశిక్ష విధించింది. నిందితుడు చేసిన నేరం తీవ్రమైనదిగా పరిగణించి మరణశిక్షను విధించింది కోర్టు.బీహార్ రాష్ట్రానికి చెందిన గఫార్ అలీ(56) గత సంవత్సరం బీడీఎల్ బానూరులో ఐదేళ్ల బాలికకు కూల్ డ్రింక్స్‌లో మద్యం కలిపి తాగించి.. అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబుతుందనే అనుమానంతో హత్య చేశాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు పోలీసులు. ఆ తర్వాత దర్యాప్తు చేసిన పోలీసులు.. నిందితుడిని అరెస్ట్ చేశారు.నిందితుడిపై నేరాభియోగానికి సంబంధించి ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాధారాలను చూపించడంతో గఫార్‌కు మరణ దండన విధిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. కాగా, ఈ ఘటన జరిగి 11 నెలలు అవుతోంది. తక్కువ సమయంలోనే దోషికి ఉరిశిక్ష పడటంతో బాలిక తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, సంగారెడ్డి జిల్లాలో 27 ఏళ్ల తర్వాత మరణశిక్ష విధించారు.ఘోరం: శిశువును కాలువలో విసిరేసిన దుండగులుగుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజుల మగ శిశువును మూటలో కట్టి కెనాల్ పక్కకు విసిరేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటన కరీంనగర్ జిల్లా తుమ్మనల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం అందించడంతో పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని శిశువును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి సమీపంలోని కాకతీయ కెనాల్ పక్కన కొందరు ఓ పసికందును విసిరేశారు. అటువైపుగా వెళ్తున్న చొక్కారెడ్డి అనే రైతు పసికందు ఏడుపు విని దగ్గరికెళ్లాడు. కెనాల్ పక్కన ఓ మూటలో మగ శిశువు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు ఆ శిశువును ఆస్పత్రిలో చేర్పించారు. ఆ శిశువు జన్మించి మూడు రోజులు అవుతుందని, శిశువు శరీరంపై గాయాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.7,390కే బ్యాంకాక్‌కు విమానయానం

## హైదరాబాద్ నుంచి డైరెక్ట్ ప్రయాణం : ఎయిర్‌ఏసియా వెల్లడి




హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు డైరెక్ట్ విమాన సేవలను ప్రారంభించనున్నట్లు ఎయిర్ ఏషియా వెల్లడించింది.గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో థారు ఎయిర్‌ఏషియా హెడ్ ఆఫ్ కమర్షియల్ తన్సితా అక్రరిత్‌పిరోమ్ మాట్లాడుతూ.. ఈ సేవలను అక్టోబర్ 27 నుంచి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రమోషనల్ ఆఫర్‌లో భాగంగా వన్ వేలో టికెట్ ధరను రూ.7,390గా నిర్ణయించామన్నారు. అక్టోబర్ 27 నుంచి 2025 మార్చి 29లోగా ప్రయాణించడానికి వీలుంగా ఈ నెల సెప్టెంబర్ 22లోపు బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వారంలో నాలుగు విమానాలు అందుబాటులో ఉంటాయన్నారు. అదే విధంగా చెన్నరు నుంచి బ్యాంకాక్‌కు అక్టోబర్ 30 నుంచి డైరెక్ట్ సేవలను అందించనున్నామన్నారు. తద్వారా దేశంలోని రెండు ముఖ్య నగరాల నుండి ప్రయాణికులు నేరుగా థాయిలాండ్‌కు వెళ్లడానికి వీలుంటుందన్నారు.

# ఇంధన ధరలు తగ్గొచ్చు..

## పెట్రోలియం శాఖ కార్యదర్శి అంచనా



న్యూఢిల్లీ : అధిక ధరల దెబ్బకు ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా పతనమైన బిజెపి ప్రభుత్వం.. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తమవుతోంది.హెచ్చు పెట్రోల్ ధరలపై ప్రజలు ఆగ్రహంతో ఉండటంతో ఉపశమనం చర్యలపై ఆలోచనలు చేస్తోందని సమాచారం. దీర్ఘకాలంలో ముడి చమురు ధరలు నిలకడగా కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపునకు ఆయిల్ కంపెనీలు మొగ్గు చూపుతాయని పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ అన్నారు. దీంతో ఆయన ధరల తగ్గింపునపై సంకేతాలు ఇచ్చినట్లయ్యింది. చమురు ధరలు ఇటీవల మూడేళ్ల కనిష్ట స్థాయికి తగ్గాయి. అయినప్పటికీ దేశంలోని అనేక నగరాల్లో లీటర్ పెట్రోల్ ధరలు రూ.100 పైనే కొనసాగుతున్నాయి. కాగా.. త్వరలో మహారాష్ట్ర, హర్యాణ వంటి కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెట్రో ధరలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

# ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా

## ధైర్యంగా నిలబడిన నాయకుడు ఏచూరి : ఎంకే స్టాలిన్



చెన్నై: సీతారాం ఏచూరి వామపక్ష ఉద్యమ నాయకుడని, జాతీయ రాజకీయాల్లో ఆయన విలక్షణమైన గొంతుక అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఏచూరి మృతికి సంతాపం తెలుపుతూ స్టాలిన్ మాట్లాడారు.విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడిన నిర్భయ నాయకుడని అన్నారు. కార్మికవర్గం కోసం లౌకికవాదం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రగతిశీల ఆదర్శాల కోసం గట్టిగా నిలబడ్డారు. కామ్రేడ్ సీతారాం ఏచూరితో తనకున్న స్నేహాన్ని ఎప్పటికీ మరువలేనని, ఆయన కుటుంబసభ్యులకు, సహచరులకు సానుభూతి తెలియజేస్తున్నానని స్టాలిన్ తెలిపారు.

